News Daily
ఎడిటర్ :
B. ఉపేందర్
cknews7484@gmail.com
Visit in :
www.cknewstv.in

# CK NEWS
చంద్రకాంత్
తెలుగు దినపత్రిక

Website
cknewstv.in

సంపుటి : 05 | సంచిక :156 | ఖమ్మం | మంగళవారం, జూలై 14, 2026 | CK NEWS | పేజీలు : 08

Hyderabad, Karimnagar, Khammam, Nalgonda, Nizamabad, Warangal, Mahabubnagar. Rangareddy, Medak, Adilabad

## భారత్-అమెరికా వాణిజ్య ఒప్పందం డెడ్‌లాక్ అయ్యిందా?



- పీయూశ్ గోయల్ ఇచ్చిన క్లారిటీ ఇదే!
- "అవన్నీ అవాస్తవం, నిరాధారం, తప్పుదోవ పట్టించే వార్తలు"
- భారత్, అమెరికా వాణిజ్య ఒప్పందంపై ప్రతిష్టంభన ఏర్పడిందనే వార్తలను ఖండించిన కేంద్ర మంత్రి పీయూశ్ గోయల్

# మూసీ పునరుజ్జీవానికి కేంద్రం నిధులు

- మెట్రో విస్తరణకు కేంద్ర ప్రభుత్వ సహకారం అవసరం
- అనుమతులు, నిధులు రావడానికి కృషి చేయాలి
- ఎంపీలకు సూచించిన సీఎం
- రాష్ట్ర ఎంపీలతో సీఎం రేవంత్ రెడ్డి భేటీ
- పార్లమెంట్ సమావేశాల్లో తెలంగాణ అంశాలపై అనుసరించాల్సిన వ్యూహంపై చర్చ
- పెండింగ్‌లో ఉన్న అంశాలను ఎంపీలకు వివరించినట్లు సమాచారం



హైదరాబాద్

పార్లమెంట్ సమావేశాల్లో తెలంగాణ అంశాలపై అనుసరించాల్సిన వ్యూహంపై కాంగ్రెస్ రాష్ట్ర ఎంపీలతో సీఎం రేవంత్‌రెడ్డి భేటీ అయ్యారు. కేంద్రం వద్ద పెండింగ్‌లో ఉన్న తెలంగాణ ప్రాజెక్టులు, అనుమతులు రావాల్సిన అంశాలను ఎంపీలకు వివరించి వాటి సాధనకు పోరాడాలని దిశానిర్దేశం చేశారు. ప్రజాభవన్‌లో జరిగిన ఈ సమావేశానికి ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, దుద్దిళ్ల శ్రీధర్‌బాబు కూడా హాజరయ్యారు. రాజకీయాలకు అతీతంగా రాష్ట్రాన్ని అభివృద్ధి చేసుకోవాలని ఎంపీలకు రేవంత్ రెడ్డి తెలిపారు. మెట్రో రైలు విస్తరణకు కేంద్ర సహకారం అవసరమని, ఆర్ఆర్ఆర్‌కు భూసేకరణ కొలిక్కి వచ్చిందని, కేంద్రం నుంచి నిధులు తెచ్చుకుని ఆర్ఆర్ఆర్ పూర్తి చేయాలని అన్నారు. హైదరాబాద్‌కు ఐఐఎం వచ్చేలా బీజేపీ ఎంపీలు చొరవ చూపాలని, మూసీ పునరుజ్జీవానికి కేంద్రం నిధులు వచ్చేలా కృషి చేయాలని సూచించారు. తుమ్మిడిహెట్టి, పోర్ట్ కనెక్టివిటీ రోడ్డుకు అనుమతులు సాధించాలని, బుల్లెట్ ట్రైన్, ఆదిలాబాద్,

వివరాలు 2లో..



## ఎల్-నినో సవాళ్లను సమర్థంగా ఎదుర్కొనేందుకు
## తెలంగాణ ప్రభుత్వం సర్వసన్నద్ధం

- ఎల్-నినో పరిస్థితులతో రైతు నష్టపోకుండా మూడు దశల ముందస్తు కార్యాచరణలో మొదటి దశ కార్యాచరణ అమలుకు సిద్ధంగా ఉండాలని అధికారులకు ఆదేశం
- ఇక్రిశాట్‌లో శాస్త్రవేత్తలతో ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించిన మంత్రి తుమ్మల
- శాస్త్రవేత్తలు సూచించిన యాజమాన్య చర్యలను రైతులకు తెలియజేసి, రైతులు క్షేత్రస్థాయిలో కచ్చితంగా అమలు చేసే విధంగా చూడాలి
- కలెక్టర్లు, వ్యవసాయ అధికారులు నిరంతరం క్షేత్రస్థాయిలో ఉండాలి
- వాతావరణ, భూగర్భజలాలు, నీటిలభ్యత పరిస్థితులపై మండలాల వారీగా వారపు బులెటిన్ విడుదల చేయాలి
- 'రైతు నేస్తం' కార్యక్రమంలో ఎల్-నినోపై రైతులకు ప్రత్యేక అవగాహన కల్పిస్తాం
- రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి శ్రీ తుమ్మల నాగేశ్వరరావు

మిగతా 2లో...



## ఒమర్ అబ్దుల్లాకు బీజేపీ షాక్..

- రూ.100 కోట్ల పరువు నష్టం నోటీసు!
- ఎమ్మెల్యేల కొనుగోలుకు బీజేపీ యత్నించిందని ఒమర్ ఆరోపణ
- ఏడు రోజుల్లో బహిరంగ క్షమాపణ చెప్పాలని నోటీసులో బీజేపీ డిమాండ్
- లేదంటే సివిల్, క్రిమినల్ చర్యలు తప్పవని హెచ్చరిక
- ఆరోపణలు నిరాధారమైనవని కొట్టిపారేసిన కాషాయదళం



## ప్రపంచ నేతలే లక్ష్యంగా ఇరాన్ హిట్‌లిస్ట్?

- జాబితాలో ట్రంప్, మెలోనీ, మెక్రాన్ పేర్లు!
- అమెరికా, యూరప్ నేతలే లక్ష్యంగా హిట్‌లిస్ట్ ప్రచురించిన ఇరాన్ పత్రిక
- అలీ ఖమేనీ హత్యకు ప్రతీకారంగానే ఈ జాబితా అంటూ ప్రకటన
- ప్రతీకారం తీర్చుకుంటామని, నేరస్తుల జాబితా సిద్ధంగా ఉందని మొజ్తబా ఖమేనీ హెచ్చరిక
- జాబితాలో ట్రంప్, నెతన్యాహు, మెక్రాన్ సహా 13 మంది ప్రముఖులు

## ఎల్-నినో ముప్పుకు చెక్ పెట్టేలా
# యాక్షన్ ప్లాన్

- ఎల్-నినోకు తెలంగాణ రెడీ..
- రైతుల కోసం మూడు దశల కార్యాచరణ
- మూడు దశల్లో ముందస్తు ప్రణాళిక
- ప్రతి వారం మండలాల వారీగా ప్రత్యేక బులెటిన్
- జిల్లాల వారీగా పరిస్థితులపై నిత్య పర్యవేక్షణ
- ఎల్-నినో ప్రభావంతో వానాకాలం-2026లో ఏర్పడే సవాళ్లను ఎదుర్కొనేందుకు తెలంగాణ ప్రభుత్వం మూడు దశల కంటింజెన్సీ ప్లాన్ సిద్ధం



హైదరాబాద్

వానాకాలం-2026లో ఎల్-నినో ప్రభావంతో ఏర్పడే పరిస్థితులను ఎదుర్కొనేందుకు తెలంగాణ ప్రభుత్వం సమగ్ర కార్యాచరణ సిద్ధం చేసింది. రైతులకు నష్టం జరగకుండా మూడు దశల కంటింజెన్సీ ప్లాన్ అమలు చేయాలని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అధికారులను ఆదేశించారు. హైదరాబాద్‌లోని ఇక్రిశాట్‌లో శాస్త్రవేత్తలు, వాతావరణ నిపుణులు, వివిధ శాఖల ఉన్నతాధికారులతో మంత్రి విస్తృత సమీక్ష నిర్వహించారు. జూలై 15, జూలై 30, ఆగస్టు 15 తేదీలను ప్రాతిపదికగా తీసుకుని వర్షాభావ పరిస్థితులకు అనుగుణంగా రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక కార్యాచరణ రూపొందించింది. వర్షాలు ఆలస్యమైనా రైతులకు విత్తనాల కొరత లేకుండా ముందుగానే భారీ స్థాయిలో నిల్వలు సిద్ధం చేస్తున్నట్లు అధికారులు వెల్లడించారు. జిల్లాల వారీగా ప్రత్యేక ప్రణాళికలు కూడా సిద్ధంగా ఉంచారు. ప్రస్తుతం

వివరాలు 2లో..

## దేవాదుల పనులు వేగవంతం చేయాలి



- మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి
- రూ.146 కోట్ల విడుదల
- డిసెంబర్ 2027 నాటికి దేవాదుల ప్రాజెక్టు పూర్తి చేస్తాం
- అన్ని పంపులను 24 గంటలూ నడపాలి
- వర్షాభావ పరిస్థితులను ఎదుర్కొనేలా ముందస్తు చర్యలు
- దేవాదుల పూర్తయితే దాదాపు 5.6 లక్షల ఎకరాలకు సాగునీరు
- కాళేశ్వరం బ్యారేజీల విషయంలో ఎన్‌డీఎస్ఏ మార్గదర్శకాలే అమలు



## ఇక హర్మూజ్ జలసంధిని మేమే నడిపిస్తాం..

- కానీ మాకు డబ్బులివ్వాలి: ట్రంప్
- హర్మూజ్ జలసంధిని స్వాధీనం చేసుకుంటున్నామన్న ట్రంప్
- ఒప్పందాన్ని ఉల్లంఘించి ఇరాన్ డ్రోన్లు పంపుతోందని ఆరోపణ
- ఇరాన్‌పై రాత్రి సైనిక దాడులు చేశామని వెల్లడి
- జలసంధి భద్రతకు ఇతర దేశాలు డబ్బు చెల్లించాలని డిమాండ్



## 'ఎస్-500' వచ్చేస్తోంది!

- భారత్‌కు రష్యా బంపర్ ఆఫర్..
- ఇక చైనా, పాకిస్థాన్‌కు చుక్కలే..!
- భారతదేశ రక్షణ రంగాన్ని మరింత పటిష్టం చేసే దిశగా ఒక కీలక పరిణామం
- దేశీయంగా ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న 'ప్రాజెక్ట్ సుదర్శన్ చక్ర'



## ప్రేమలో ఉన్న అమ్మాయి, అబ్బాయి పారిపోకుండా ప్రభుత్వం ఎలా ఆపగలదు?

- పోక్సో దుర్వినియోగంపై సుప్రీంకోర్టు కీలక వ్యాఖ్యలు
- ప్రేమలో ఉన్న టీనేజీ యువతపై పోక్సో చట్టం దుర్వినియోగం అవుతుందని సుప్రీంకోర్టు ఆందోళన
- ఆ జంట పారిపోకుండా ప్రభుత్వం ఎలా ఆపగలదని ప్రశ్న
- కుటుంబ పరువు కోసం తల్లిదండ్రులు కేసులు పెడుతున్నారని వ్యాఖ్య

## ఎల్-నినో సవాళ్లను సమర్థంగా ఎదుర్కొనేందుకు

# తెలంగాణ ప్రభుత్వం సర్వసన్నద్ధం

సి కె న్యూస్ ప్రతినిధి

వానాకాలం--2026లో ఎల్-నినో ప్రభావాలను దృష్టిలో పెట్టుకుని తెలంగాణ ప్రభుత్వం ఎలాంటి పరిస్థితినైనా సమర్థంగా ఎదుర్కొనేలా అన్ని రకాల ముందస్తు చర్యలు చేపట్టిందని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు.

సోమవారం హైదరాబాద్‌లోని ఇక్రిశాట్ లో భారత వాతావరణ శాఖ , ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం, ఇండియన్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ ఆయిల్‌సీడ్స్ రీసెర్చ్ , ఇండియన్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ మిల్లెట్స్ రీసెర్చ్ , సెంట్రల్ రీసెర్చ్ ఇన్స్టిట్యూట్ ఫర్ డ్రైల్యాండ్ అగ్రికల్చర్ శాస్త్రవేత్తలు, వ్యవసాయ అనుబంధరంగ ఉన్నతాధికారులతో మంత్రి సమగ్ర సమీక్ష నిర్వహించారు. ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి ఆదేశాల మేరకు రాష్ట్ర ప్రభుత్వం రూపొందించిన మూడు దశల కంటింజెన్సీ ప్రణాళికలను ఈ సమావేశంలో సమగ్రంగా పరిశీలించి, శాస్త్రవేత్తలు ఇచ్చిన సూచనలకు అనుగుణంగా తుది కార్యాచరణపై మంత్రి చర్చించారు.

ముందుగా వివిధ ఇన్స్టిట్యూషన్స్ నుంచి వచ్చిన శాస్త్రవేత్తలు ఎల్-నినో పరిస్థితులను తట్టుకునేవిధంగా వారు వారు సిద్ధం చేసిన కార్యచరణను మంత్రికి తెలియచేశారు. ముఖ్యంగా కరువు పరిస్థితులను ఎదుర్కొనేందుకు వీలుగా తట్టుకొనే పంటలు మరియు రకాలు, ఇప్పటికే సాగు చేసిన పంటలలో తీసుకోవాల్సిన చర్యలపై నివేదిక సమర్పించారు.

ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, శాస్త్రవేత్తలు సూచించిన ప్రతి యాజమాన్య చర్యను క్షేత్రస్థాయిలో రైతులకు చేరవేసి, జిల్లాల్లో అధికారులు తప్పనిసరిగా అమలు చేయాలని స్పష్టం చేశారు. జిల్లా కలెక్టర్లు, వ్యవసాయ అనుబంధరంగ అధికారులు నిరంతరం క్షేత్రస్థాయిలో ఉండి పరిస్థితులను పర్యవేక్షించాలని ఆదేశించారు.

తరువాత మాట్లాడిన వ్యవసాయశాఖ డైరెక్టర్ ఎల్-నినో ప్రభావంతో వర్షాలు ఆలస్యమవడం, మధ్యలో దీర్ఘకాలిక పొడి పరిస్థితులు , అధిక ఉష్ణోగ్రతలు నమోదయ్యే అవకాశాలను దృష్టిలో పెట్టుకుని జూలై 15, జూలై 30, ఆగస్టు 15 తేదీలను ప్రాతిపదికగా తీసుకుని మూడు దశల్లో రాష్ట్రవ్యాప్త కంటింజెన్సీ ప్రణాళిక రూపొందించినట్లు తెలిపారు. పరిస్థితులకు అనుగుణంగా జిల్లా వారీగా ప్రత్యేక కార్యాచరణ ప్రణాళికలను సిద్ధం చేసినట్లు చెప్పారు.

జూలై 15 వరకు వర్షాలు ఆలస్యమైతే 16.30 లక్షల క్వింటాళ్ల విత్తనాలు, జూలై 30 వరకు ఆలస్యమైతే 13.82 లక్షల క్వింటాళ్లు, ఆగస్టు 15 వరకు వర్షాభావ పరిస్థితులు కొనసాగితే 12.70 లక్షల క్వింటాళ్ల విత్తనాలు అవసరమవుతాయని అంచనా వేసి ముందుగానే అందుబాటులో ఉంచేందుకు చర్యలు చేపట్టినట్లు తెలిపారు.

ఆ తరువాత మాట్లాడిన ఇరిగేషన్ శాఖ , భూగర్భజలశాఖ, మరియు మిగతాశాఖ అధికారులు మంత్రిగారికి నీటిలభ్యత వివరాలు మరియు విద్యుత్ సరఫరాకు సంబంధించిన రాష్ట్రవ్యాప్తంగా నెలకొన్న పరిస్థితులను వివరించారు.

అనంతరం మంత్రి మాట్లాడుతూ.. రాష్ట్రంలోని 33 జిల్లాల వర్షపాతం పరిస్థితులను ప్రభుత్వం రోజువారీగా సమీక్షించాలని మంత్రి తెలిపారు. ప్రస్తుత నివేదిక ప్రకారం 13 జిల్లాల్లో సాధారణ వర్షపాతం నమోదుకాగా, 20 జిల్లాల్లో వర్షపాతం లోటు ఉందన్నారు. వర్షాభావ జిల్లాల్లో జిల్లా కలెక్టర్లు, వ్యవసాయ అధికారులు, శాస్త్రవేత్తలు సంయుక్తంగా పరిస్థితులను సమీక్షిస్తూ అవసరమైన చర్యలు వెంటనే తీసుకోవాల్సిందిగా సూచించారు.

శాస్త్రీయ విధానాలతో ఎల్-నినోను ఎదుర్కోవాలని, దీనికి సంబంధించి రాష్ట్రంలో విధానాన్ని అమలు చేయాలని మంత్రి సూచించారు. ఇందులో భాగంగా నిజ సమయ వర్షపాతం పర్యవేక్షణ, వాతావరణ ఆధారిత వ్యవసాయ సలహాలు, నేల తేమ పర్యవేక్షణ, పంటల ఎదుగుదల అంచనా, వాతావరణ ప్రమాద విశ్లేషణ, ప్రత్యామ్నాయ పంటల కార్యాచరణ ప్రణాళిక, పొలంలోనే నేల తేమ సంరక్షణ చర్యలు, పంటల వైవిధ్యీకరణ వంటి శాస్త్రీయ విధానాలను అమలు చేయాలని ఆదేశించారు.

### వాతావరణ, భూగర్భజలాలు, నీటిలభ్యత పరిస్థితులపై మండలాల వారీగా వారపు బులెటిన్

ఎల్-నినో పరిస్థితులను సమర్థంగా ఎదుర్కోవాలంటే వివిధ శాఖల మధ్య సమన్వయం అత్యంత కీలకమని మంత్రి తుమ్మల అన్నారు. ఈ నేపథ్యంలో భారత వాతావరణ శాఖ , నీటిపారుదల శాఖ, భూగర్భ జలాల శాఖ, విద్యుత్ శాఖ,



వ్యవసాయ శాఖ, ఉద్యానవన శాఖలు సమన్వయంతో ప్రతి వారం మండలాల వారీగా సమగ్ర వ్యవసాయ-వాతావరణ బులెటిన్ విడుదల చేయాలని అధికారులను ఆదేశించారు.

ఆగస్టు నెలాఖరు వరకు ప్రతి వారం విడుదల చేసే ఈ బులెటిన్‌లో మండలాల వారీగా నమోదైన వర్షపాతం, రాబోయే వారానికి, నెలాఖరు వరకు ఉండే వాతావరణ పరిస్థితుల అంచనాలు, డ్రై స్పెల్స్ ఏర్పడే అవకాశాలు, గరిష్ఠ--కనిష్ఠ ఉష్ణోగ్రతలు, నేల తేమ పరిస్థితులు, భూగర్భ జలాల లభ్యత, సాగునీటి పరిస్థితి, విద్యుత్ సరఫరా, పంటల స్థితి, రైతులు చేపట్టాల్సిన యాజమాన్య చర్యలతో పాటు నీటిపారుదల శాఖ ప్రాజెక్టుల క్యాచ్‌మెంట్ ప్రాంతాల్లో ఈ నెల, వచ్చే నెలకు సంబంధించిన వాతావరణ అంచనాలను విశ్లేషించి, ఆయా ప్రాజెక్టుల్లో అందుబాటులో ఉండే నీటి నిల్వలు, ఇన్‌ఫ్లోలు, సాగునీటి లభ్యతపై ఖచ్చితమైన అంచనాలను కూడా బులెటిన్‌లో పొందుపరచాలని మంత్రి స్పష్టం చేశారు. భూగర్భ జలాల శాఖ మండలాల వారీగా భూగర్భ జలాల లభ్యతపై తాజా సమాచారాన్ని అందించి, నీటి వినియోగ ప్రణాళికను రూపొందించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

ఈ వారపు బులెటిన్‌ను రైతు వేదికలు, గ్రామపంచాయతీలు, వ్యవసాయ విస్తరణ అధికారులు, వాట్సాప్ గ్రూపులు, సోషల్ మీడియా వేదికలు, డిజిటల్ ప్లాట్‌ఫారాలు, స్థానిక మీడియా ద్వారా విస్తృతంగా రైతులకు చేరవేయాలని, రైతులకు ఎప్పటికప్పుడు శాస్త్రీయ సమాచారం అందేలా వ్యవస్థను బలోపేతం చేయాలని అధికారులను ఆదేశించారు.

### శాస్త్రవేత్తలు సూచించిన యాజమాన్య చర్యలను అమలు చేయాలి

ఇక్రిశాట్‌లో జరిగిన సమీక్షలో శాస్త్రవేత్తలు వర్షాకాలం ఆలస్యంగా ప్రారంభమవడం, దీర్ఘకాలిక పొడి పరిస్థితులు ఏర్పడే అవకాశాలను దృష్టిలో ఉంచుకుని పలు కీలక సూచనలు చేశారు. వర్షపాతం నమోదై భూమిలో తగినంత తేమ ఏర్పడిన తర్వాత మాత్రమే విత్తనాలు వేయాలని, బ్రాడ్ బెడ్ అండ్ ఫరో లేదా రిడ్జ్ అండ్ ఫరో పద్ధతులను అనుసరించాలని, భూమిలో తేమ ఏర్పడే వరకు ఎరువుల వినియోగాన్ని వాయిదా వేయాలని, నేల తేమను కాపాడేందుకు తరచూ ఇంటర్ కల్టివేషన్ చేపట్టాలని, వర్షాలు కురిసిన తర్వాత మాత్రమే సిఫార్సు చేసిన మోతాదులో నత్రజని, పొటాష్ ఎరువులు వేయాలని శాస్త్రవేత్తలు సూచించారు.

అలాగే పంటల కీలక ఎదుగుదల దశల్లో ప్రాణాధార నీటిపారుదల అందించడం, వరుస పంటల్లో స్కిప్ రో ఇరిగేషన్ అమలు చేయడం, దీర్ఘకాలిక పొడి పరిస్థితుల్లో 2 శాతం యూరియా లేదా 1 శాతం పొటాషియం నైట్రేట్ ద్రావణాన్ని ఆకులపై పిచికారీ చేయడం, ప్రతి 3.6 మీటర్లకు ఒక డెడ్ ఫరో ఏర్పాటు చేసి వర్షపు నీటిని సంరక్షించడం, వ్యవసాయ కుంటల్లో నిల్వ చేసిన నీటిని అవసరమైన సమయంలో వినియోగించడం, అంతర పంటలను ప్రోత్సహించడం, వాతావరణ ఆధారిత వ్యవసాయ సలహాలను తప్పనిసరిగా పాటించాలని శాస్త్రవేత్తలు సూచించారని మంత్రి తెలిపారు.

ఈ సూచనలన్నింటినీ రైతులకు క్షేత్రస్థాయిలో పూర్తిస్థాయిలో చేరవేసి, అమలయ్యేలా జిల్లా అధికారులు ప్రత్యేక కార్యాచరణ చేపట్టాలని మంత్రి ఆదేశించారు.

### వరి రైతులకు ప్రత్యేక సూచనలు

శాస్త్రవేత్తలు సూచించనట్టుగా.. ప్రస్తుతం వరి పంట నారుమడి దశలో ఉన్న రైతులు నారు పీకడానికి వారం రోజుల ముందు ఎకరానికి 800 గ్రాముల కార్బోఫ్యూరాన్ 3జ+ గ్రాన్యూల్స్ వేయాలని, నాటే సమయంలో నారు ఆకుల చివరలను కత్తిరించి నాటాలని, 15ఐ10 సెంటీమీటర్ల దూరంతో దగ్గరగా నాటి ప్రతి గుంతలో 6--8 మొక్కలు ఉంచాలని, సిఫార్సు చేసిన మోతాదుతో పోలిస్తే 25 శాతం అదనపు నత్రజని ఇవ్వాలని, మొత్తం నత్రజనిలో 70 శాతం నాటే సమయంలో, మిగిలిన 30 శాతం పూత ప్రారంభ దశలో వేయాలని మంత్రి అన్నారు. నీటి పొదుపు కోసం అలటర్నేట్ పద్ధతిని అమలు చేయాలని తెలిపారు.

ఇంకా నారు వేయని రైతులు తక్కువ కాలంలో పండే రకాలతో డ్రై డైరెక్ట్ సీడెడ్ రైస్ విధానాన్ని అనుసరించాలని సూచించారు. కాలువల ఆయకట్టు ప్రాంతాల్లో నీటి లభ్యతను బట్టి వరికి బదులుగా మొక్కజొన్న, సజ్జలు, రాగులు, కందులు, మినుములు, పొద్దుతిరుగుడు, నువ్వులు, అలసందలు, కూరగాయలు వంటి ప్రత్యామ్నాయ పంటలను ప్రోత్సహించాలని తెలిపారు.

### మొక్కజొన్న, పత్తి రైతులకు అప్రమత్తత అవసరం

ఇప్పటికే సాగుచేసిన మొక్కజొన్న, పత్తి పంటలు ప్రస్తుతం మొలక దశలో ఉన్నందున రాబోయే రెండు వారాల్లో వర్షాభావ పరిస్థితులు కొనసాగితే నేల తేమను కాపాడేందుకు కలుపు నియంత్రణ చర్యలు రైతులకు సూచించాలని మంత్రి తెలిపారు.

### విత్తనాలు, ఎరువుల కొరత ఉండదు

రాష్ట్రంలో అవసరమైన విత్తనాలు, ఎరువులపై ఇప్పటికే సమగ్ర అంచనా పూర్తి చేశామని మంత్రి తెలిపారు. మూడు దశల కంటింజెన్సీ ప్రణాళికలకు అనుగుణంగా అవసరమైన విత్తనాలను ముందుగానే సమీకరించామని, మార్క్‌ఫెడ్, విత్తన సంస్థలు, జిల్లా యంత్రాంగంతో సమన్వయం చేసుకుంటూ రైతులకు ఎలాంటి కొరత లేకుండా చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు.

### 'రైతు నేస్తం'లో ప్రత్యేక అవగాహన

'రైతు నేస్తం' కార్యక్రమంలో ఎల్-నినో ప్రభావాలు, ప్రత్యామ్నాయ సాగు, నీటి యాజమాన్యం, నేల తేమ సంరక్షణ, వాతావరణ ఆధారిత వ్యవసాయ పద్ధతులు, శాస్త్రవేత్తలు సూచించిన యాజమాన్య చర్యలపై రైతులకు ప్రత్యేక అవగాహన కల్పిస్తామని మంత్రి తెలిపారు. ప్రతి రైతు వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా నిర్ణయాలు తీసుకునేలా వ్యవసాయ అధికారులు గ్రామస్థాయిలో మార్గనిర్దేశం చేస్తారని చెప్పారు.

"ఎల్-నినో ప్రభావం ఎంత తీవ్రంగా ఉన్నా రైతు నష్టపోకుండా అవసరమైన ప్రతి చర్య తీసుకుంటాం. శాస్త్రవేత్తలు సూచించిన ప్రతి వ్యవసాయ యాజమాన్య పద్ధతిని క్షేత్రస్థాయిలో రైతులకు చేరవేసి, వాటిని అమలు చేసే బాధ్యత జిల్లా యంత్రాంగం తీసుకోవాలి. ప్రతి జిల్లా యంత్రాంగాన్ని అప్రమత్తం చేశాం. రైతులు ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదు. ప్రభుత్వం అన్ని విధాలుగా రైతుకు అండగా ఉంటుంది." అని మంత్రి పేర్కొన్నారు.

ఈ సమావేశంలో వ్యవసాయశాఖ సెక్రటరీ సురేంద్రమోహన్, ఇక్రిశాట్ డిప్యూటి డైరెక్టర్ జనరల్ స్టాన్ఫోర్డ్ బ్లేడ్, వ్యవసాయశాఖ డైరెక్టర్ గోపి, హార్టికల్చర్ డైరెక్టర్ యాస్మిన్ బాషా, కమిషనర్ కోఆపరేషన్ రాహుల్ రాజ్, హాకా ఎండి చంద్రశేఖర్, గిడ్డంగుల శాఖ ఎండి లక్ష్మీ, జితేష్ పాటిల్, అగ్రి, హార్టికల్చర్ యూనివర్సిటీల వీసీలు జానయ్య, రాజిరెడ్డి, ఇక్రిశాట్ ప్రిన్సిపల్ సైంటిస్ట్ హరికిషన్ మరియు ఇతర అధికారులు పాల్గొన్నారు

## ఫ్లడ్.. బ్లడ్.. పీక్స్‌కు చేరిన కాళేశ్వరం వార్!

**హైదరాబాద్:** కాళేశ్వరం ప్రాజెక్టు అంశంపై తెలంగాణలో కాంగ్రెస్, బీఆర్‌ఎస్ మధ్య రాజకీయ పోరు మరింత వేడెక్కింది. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలను నిరసిస్తూ బీఆర్‌ఎస్ రక్తదాన శిబిరం నిర్వహించగా.. దీనికి కౌంటర్‌గా కాంగ్రెస్ 'అవినీతి కాళేశ్వరం' పేరుతో ప్రత్యేక కార్యక్రమం చేపట్టింది. దీంతో ఉద్రిక్త పరిస్థితులు తలెత్తకుండా ఇటు తెలంగాణ భవన్, అటు గాంధీభవన్ వద్ద భారీగా పోలీసులు మోహరించాల్సి వచ్చింది. సీఎం రేవంత్‌రెడ్డి వ్యాఖ్యలను నిరసిస్తూ సోమవారం హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో పీవీ నరసింహారావు మెమోరియల్ ట్రస్ట్ సౌజన్యంతో బీఆర్‌ఎస్వీ.. 'రేవంత్ రక్తదాహానికి రక్తదానం' అనే నినాదంతో బ్లడ్ డొనేషన్ క్యాంప్ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హాజరైన పలువురు నేతలు.. ప్రభుత్వ రాజకీయ కక్షసాధింపులో భాగంగానే కాళేశ్వరం అంశాన్ని వాడుకుంటోందని మండిపడ్డారు. ప్రజల దృష్టి మరల్చేందుకే సీఎం ఇటువంటి వ్యాఖ్యలు చేస్తున్నారని విమర్శించారు. సేకరించిన రక్తపు ప్యాకెట్లతో.. సీఎం రేవంత్ నివాసానికి వెళ్లి నిరసన తెలుపుతామని బీఆర్‌ఎస్వీ నేతలు అంటున్నారు. దీంతో తెలంగాణ భవన్ బయట భారీగా పోలీసులు మోహరించారు. ఇక.. మరోవైపు అధికార కాంగ్రెస్ కూడా అదే స్థాయిలో ఎదురుదాడికి దిగింది. గాంధీభవన్‌లో 'అవినీతి కాళేశ్వరం' పేరుతో కార్యక్రమం నిర్వహించింది. ఈ సందర్భంగా మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ చిత్రపటాన్ని ప్రదర్శించింది. ప్రాజెక్టు లోపాలు అంటూ పలు చిత్రాలను ప్రదర్శిస్తోంది. ఈ సందర్భంగా కాళేశ్వరం ప్రాజెక్టులో భారీ అవినీతి జరిగిందని కాంగ్రెస్ నేతలు ఆరోపించారు. ఈ వ్యవహారంలో



బాధ్యులపై చట్టపరమైన చర్యలు తప్పవని స్పష్టం చేశారు. కాళేశ్వరం అంశాన్ని ఇరు పార్టీలు రాజకీయ ఆయుధంగా మార్చుకోవడంతో రాష్ట్ర రాజకీయాలు మరింత వేడెక్కాయి. ఒకవైపు బీఆర్‌ఎస్ ప్రభుత్వాన్ని టార్గెట్ చేస్తోందని కాంగ్రెస్ ఆరోపిస్తుండగా.. మరోవైపు రాజకీయ కక్షతోనే తమపై దుష్ప్రచారం చేస్తున్నారని బీఆర్‌ఎస్ ఎదురుదాడి చేస్తోంది. దీంతో కాళేశ్వరం వ్యవహారం చుట్టూ అధికార, ప్రతిపక్షాల మధ్య రాజకీయ పోరు మరింత ఉధృతమవుతోంది.

## మూసీ పునరుజ్జీవానికి కేంద్రం నిధులు

-మొదటిపేజీ తరువాయి

వరంగల్ విమానాశ్రయాలు త్వరగా పూర్తి చేసుకోవాలని కోరారు. కేంద్రం సహకరిస్తే ఒప్పుకునేందుకు ఎలాంటి భేషజాలు లేవని స్పష్టం చేశారు. గోదావరి, కావేరి అనుసంధానంతో రాష్ట్రానికి ప్రయోజనం ఉంటుందిని, 120 టీఎంసీలకు కేంద్రం అనుమతులు వస్తే ప్రాజెక్టులు వేగంగా పూర్తి చేసుకోవచ్చని వెల్లడించారు. కేంద్రం నుంచి సాధించాల్సిన అంశాలపై ఎంపీలకు సీఎం దిశానిర్దేశం చేశారు.

### అనుమతులు, నిధులు రావడానికి కృషి చేయాలి

పలు జాతీయ రహదారులకు అనుమతులు, నిధులు, ఇతర అనుమతుల సాధనలో పెండింగ్‌లో ఉన్న అంశాలను ఎంపీలకు వివరించినట్లు సమాచారం. రాష్ట్ర ప్రభుత్వ శాఖల వారీగా ఎంపీ అందజేసే అంశాలు కేంద్రం వద్ద పెండింగ్‌లో ఉన్నాయనే సమాచారాన్ని సిద్ధం చేసి ఎంపీలకు ఇప్పటికే అందజేశారు. వాటిపై ఇప్పటికే సీఎం, మంత్రులు ఢిల్లీకి వెళ్లి అనేకసార్లు విజ్ఞప్తి చేసినందున అనుమతులు, నిధులు రావడానికి కృషి చేయాలని ఎంపీలకు సీఎం దిశానిర్దేశం చేసినట్లు తెలుస్తోంది.

## తెలంగాణలో మళ్లీ ఎండాకాలం!

-మొదటిపేజీ తరువాయి

పాటు తెలంగాణలో వర్షాలు కురవకపోగా ఎండల తీవ్రత మరింత పెరిగే అవకాశం ఉందని పేర్కొన్నారు. ప్రస్తుతం నమోదవుతున్న గరిష్ట ఉష్ణోగ్రతలు మరో ఒకటి రెండు డిగ్రీలు పెరిగే అవకాశం ఉందని వెల్లడించారు. రాగల 5,6 రోజుల పాటు వర్షాలు కురిసే అవకాశం లేదని స్పష్టం చేశారు. ఎల్‌నినో ప్రభావంతో రాష్ట్రంలో నెలకొన్న తీవ్ర వర్షాభావ పరిస్థితులు ఉన్నాయని, ఈ సీజన్‌లో ఇప్పటి వరకు 30 శాతంపైగా లోటు వర్షపాతం నమోదైందని తెలిపారు.

### ఉష్ణోగ్రతలు క్రమంగా పెరుగుతున్నాయి

తెలంగాణ రాష్ట్రంలో జులై 2వ వారంలో మంచిగా వర్షాలు పడే సమయమని, కానీ వానలు కురవకపోయిన క్లౌడింగ్ ఉందని, ఈ సమయంలో 30 నుంచి 32 డిగ్రీల ఉష్ణగ్రత ఉండే అవకాశం ఉంటుందని శ్రీనివాస్ రావు తెలిపారు. రాష్ట్రంలో ఎల్‌నినో ప్రభావంతో మొదట వారంలో ఈదురుగాలులు వీచాయని, ప్రస్తుతం తగ్గుముఖం పట్టాయని, క్లౌడినెస్? కూడా లేదని చెప్పారు. దీంతో గత నాలుగు రోజులుగా రాష్ట్రవ్యాప్తంగా ఉష్ణోగ్రతలు క్రమంగా పెరుగుతున్నాయని, 37 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదవుతుందని, ప్రస్తుతానికి హెచ్చరికల స్థాయికి ఉష్ణోగ్రతలు పెరగలేదని వెల్లడించారు. వర్షాలు కురవకపోవడానికి ఎల్?నినో ప్రభావం అని కూడా చెప్పవచ్చని, కొన్ని ప్రదేశాల్లో వర్షాలు విపరీతంగా కురిశాయని, కొన్ని చోట్ల వానలు పడలేదని, ఈ లక్షణాలు ఎల్?నినోకే ఉంటాయని పేర్కొన్నారు. "గత పది రోజులు క్రితం పశ్చిమ తీరంలో అధికంగా వర్షాలు పడ్డాయి. వాయు బంగాళాఖాతంలో అల్పపీడనం వాయుగుండంగా మారి ఒడిస్సా ప్రాంతంలో కూడా వర్షాలు కురిశాయి. తెలంగాణలో ఈదురుగాలులు కొనసాగాయి. వర్షాలు అప్పటి నుంచి పడలేదు. జూన్ ఆఖరి వారం నుంచి వానలు లేవు. ఈదురు గాలులు వేగం కూడా తగ్గింది. కొన్ని జిల్లాల్లో మాత్రం ఈదురుగాలులు కొనసాగుతున్నాయి. తెలంగాణ వాతావరణ పరిస్థితుల కారణంగా అక్కడక్కడ చిన్నపాటి చినుకులు పడుతున్నాయి. రాగల 5,6 రోజుల పాటు వర్షాలు కురిసే అవకాశం లేదు"

## సత్ఫలితాలిస్తున్న నిపుణ్ భారత్ మిషన్...

### తెలంగాణలో మెరుగైన విద్యా ప్రమాణాలు

జాతీయ విద్యా విధానం (ఎన్ ఈపీ) 2020, భారతదేశ విద్యా సంస్కరణల అజెండాలో మౌలిక బాష, గణిత సామర్థ్యాలకు (ఎఫ్ఎల్ఎన్) కేంద్ర స్థానం కల్పించింది. దీని ప్రకారం.. మూడో తరగతి చదివే విద్యార్థి.. అతనికి ఇచ్చిన పాఠ్యాంశాలను అర్థవంతంగా చదవడం, ప్రాథమిక గణిత లెక్కలు చేయగలగడం అనేది చాలా ముఖ్యమని స్పష్టంగా చెప్పింది. ఇది ఆ విద్యార్థి తర్వాత తరగతుల్లో జీవితంలో వచ్చే ప్రతి అభ్యసన దశను తీర్చిదిద్దుతుందని గుర్తించిన విద్యా మంత్రిత్వ శాఖ జూలై 2021లో 'నిపుణ్ భారత్ మిషన్'ను ప్రారంభించింది. ఇది పాఠ్యప్రణాళిక, ఉపాధ్యాయుల సామర్థ్యం, మూల్యాంకనం, తల్లిదండ్రుల భాగస్వామ్యం, డేటా ఆధారిత పాలన వంటి అంశాలను కలుపుకొని పనిచేసే ఒక సమగ్ర విధానం. ప్రతి బిడ్డ ప్రాథమిక అభ్యసన మైలురాళ్లను సాధించేలా చూడటమే దీని లక్ష్యం. తెలంగాణలో, ఈ జాతీయ విధానం విద్యా సంస్కరణలకు అద్భుతమైన చోదక శక్తిగా నిలిచింది. దీని ఫలితంగా 24,000 ప్రభుత్వ పాఠశాలల్లో 10.34 లక్షల మంది విద్యార్థులకు ఎఫ్ఎల్ఎన్ గ్రేడ్‌లు అందాయి. ఈ సంస్కరణలకు 60,000 మంది ప్రాథమిక తరగతి ఉపాధ్యాయులు సహకారం అందించారు. ఇప్పుడు తెలంగాణ రాష్ట్ర విద్యా గణాంకాలలో ఈ ఫలితాలు స్పష్టంగా కనిపిస్తున్నాయి. గత 2024--25 , 2025--26 విద్యా సంవత్సరాల మధ్య, తెలుగు వాక్య పఠన స్కోర్లు 6 శాతం పాయింట్లు, ఆంగ్లంలో 9 పాయింట్లు, గణిత కూడిక--తీసివేత స్కోర్లు 8 పాయింట్లు పెరిగాయి.

### తనిఖీ తంతుకు చెల్లుచీటీ...

గత 2022 వరకు తెలంగాణలో పాఠశాలల సందర్శనలు కేవలం తనిఖీ తంతులా సాగేవి. బోధన--అభ్యసన సామగ్రిని గానీ, బోధనా నాణ్యతను గానీ క్రమపద్ధతిలో పర్యవేక్షించేవారు కాదు. సమీక్షా సమావేశాలు పరిపాలనాపరమైన ఆదేశాలు జారీ అయ్యేవి కానీ, అభ్యసన ఫలితాలపై అరుదుగా మాత్రమే చర్చించేవి. అంతేకాకుండా, విడివిడిగా ఉన్న డేటా వ్యవస్థల వల్ల, తరగతి గదుల్లో వాస్తవంగా ఏం జరుగుతుందో ఎవరికీ తెలిసే అవకాశం ఉండేది కాదు.

### కొత్తగా...నిర్మాణాత్మకంగా...

కొత్తగా చేపట్టిన చర్యల్లో కీలకమైనది పాఠశాల పర్యవేక్షణలో గతంలో విడివిడిగా ఉన్న మూడు విభాగాలైన సందర్శనలు, సమీక్షలు, డేటాను ఒకే అనుసంధానిత పరిపాలనా వ్యవస్థగా మార్చడం. దీని ద్వారా పాఠశాలల సందర్శనలను పరిపాలనా తనిఖీల నుంచి క్రమబద్ధమైన మార్గదర్శక కార్యక్రమాలుగా పునఃరూపకల్పన చేశారు. క్లస్టర్ స్థాయి నుండి రాష్ట్ర స్థాయి వరకు ప్రతి స్థాయిలోని అధికారులు ఇప్పుడు తెలంగాణ పాఠశాల విద్యా అప్లికేషన్ లో నేరుగా నమోదు చేసిన ఒకే ఉమ్మడి పరిశీలన సాధనాన్ని ఉపయోగిస్తున్నారు. సందర్శన జరిగిందా లేదా అనే దానితో పాటు, వాస్తవంగా ఏం గమనించారు? దానిపై తదుపరి చర్యలు ఏం తీసుకున్నారు అనే దాని ఆధారంగా సందర్శన నాణ్యతను అంచనా వేస్తున్నారు.

### డిజిటల్ ఆధారిత పర్యవేక్షణ..

పరిపాలనా బులెటిన్ లకు బదులుగా, పర్యవేక్షణ డాష్‌బోర్డ్‌ల నుండి లభించే ప్రత్యక్ష డేటా ఆధారంగా ఎస్ఇఆర్‌టి రూపొందించిన, అభ్యాసంపై దృష్టి సారించి నిర్దిష్ట ఎజెండాలతో నెలవారీ సమీక్షా సమావేశాలను తప్పనిసరి చేశారు. ఈ రెండింటికీ ఆధారం ఐదు ప్లాట్ ఫారమ్‌లతో కూడిన డిజిటల్ నిర్మాణం ఇంటిగ్రేటెడ్ స్కూల్ మేనేజ్‌మెంట్ సిస్టమ్ పోర్టల్, తెలంగాణ స్కూల్ ఎడ్యుకేషన్ అప్లికేషన్, ట్రాకింగ్, ట్రైనింగ్ మేనేజ్‌మెంట్ సిస్టమ్, విద్యా సమీక్షా కేంద్రం (విఎస్‌కె) పర్యవేక్షణ కేంద్రం ఇది 33 జిల్లాలన్నింటిలోనూ ఒకే, నిజ--సమయ ప్రామాణిక సమాచార వనరుగా ప్రత్యక్షంగా పనిచేస్తోంది. విఎస్‌కె సిబ్బంది ఈ డాష్‌బోర్డ్‌లను నిరంతరం పర్యవేక్షిస్తూ, లోపాలను గుర్తించి, నేరుగా తదుపరి చర్యలు తీసుకుంటున్నారు. అదే సమయంలో, 2,100 మందికి పైగా అధికారులు ఇప్పుడు పర్యటనలు నిర్వహిస్తూ, బ్లాక్ , క్లస్టర్ సమీక్షలను సులభతరం చేస్తున్నారు. ఇంకా, 100 మందికి పైగా సీనియర్ అధికారులు ఇదే ప్రత్యక్ష డేటాను ఉపయోగించి రాష్ట్ర , జిల్లా సమావేశాలకు అధ్యక్షత వహిస్తున్నారు.

### ఫలితాలు సుస్పష్టం...

మొత్తంగా విద్యా వ్యవస్థలో చేపట్టిన సంస్కరణల ఫలితాలు స్పష్టంగా కనిపిస్తున్నాయి. గత 2025--26 విద్యా సంవత్సరంలో అధికారుల స్కూల్ విజిట్స్ 2.5 రెట్లు పెరిగి 1.5 లక్షలకు పైగా చేరాయి, ప్రతి త్రైమాసికంలో 98% పాఠశాలలను సందర్శిస్తున్నారు. ఇప్పుడు బోధనా--అభ్యసన సామగ్రి విద్యా సంవత్సరం మొదటి నెలలోనే 90% కంటే ఎక్కువ మంది విద్యార్థులకు చేరుతోంది. సమీక్షా సమావేశాలు మరింత క్రమబద్ధంగా మారాయి. సెంట్రల్ స్క్వేర్ ఫౌండేషన్ సాంకేతిక సహకారంతో తెలంగాణ ఎస్‌సిఇఆర్‌టి 33 జిల్లాల వ్యాప్తంగా 2వ తరగతి పిల్లలకు వార్షిక నమూనా--ఆధారిత మూల్యాంకనాన్ని ఏర్పాటు చేసింది. గత 2022--23 విద్యా సంవత్సరం నుంచి ఏటా నిర్వహిస్తున్న ఈ మూల్యాంకనం, ప్రస్తుతం 1,750కి పైగా పాఠశాలల్లోని సుమారు 8,500 మంది పిల్లలను కవర్ చేస్తోంది.

## మహాశైవాక్ష యోగం సందర్భంగా బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ పూజలు

- వర్షాలు పడాలని ఎమ్మెల్యే ప్రత్యేక పూజలు



సీ కే న్యూస్వందేళ్లకోకసారి వచ్చే మహాశైవాక్ష యోగం సందర్భంగా సోమవారం నెరడిగొండ మండల కేంద్రంలోని శివాలయాన్ని బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ దర్శించుకున్నారు. ఈ సందర్భంగా వర్షాలు పడక రైతులు ఇబ్బందులు పడుతున్న నేపథ్యంలో వర్షాలు పడి రైతుల పాడి పంటలు చక్కగా పండాలని కోరుకున్నట్లు ఎమ్మెల్యే అనిల్ జాదవ్ తెలిపారు. వీరి వెంట స్థానిక సర్పంచ్ నీలిమ రవీందర్ రెడ్డి, మండల కన్వీనర్ శివారెడ్డి, మాజీ ఉప సర్పంచ్ దేవేందర్ రెడ్డి, నాయకులు సుజీల్, బాబులాల్, ఎలుక రాజు తదితరులు ఉన్నారు

## ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేయాలని బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ ను కలిసిన కరత్వాడ గ్రామస్తులు



సీ కే న్యూస్బోథ్ మండలంలోని కరత్వాడ మహిళలు ఈరోజు బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ గారిని కలిశారు. ఈ సందర్భంగా తమ గుడిసెల చిత్రాలను ఎమ్మెల్యే కు చూయించారు. వర్షాకాలంలో తమ గుడిసెల పరిస్థితి అధ్వనంగా మారుతుందని తమకు ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేయాలని విన్నవించారు. స్పందించిన ఎమ్మెల్యే గృహ నిర్మాణ శాఖ అధికారులతో మాట్లాడి సర్వే చేసి వివరాలను అందజేయాలని ఆదేశించారు. అర్హులైన ప్రతీ పేదవారికి ఇండ్లు అందేలా కృషి చేస్తానని తెలిపారు

## ఎస్ఐఆర్ ప్రక్రియను వేగవంతంగా, నిబంధనల మేరకు పూర్తి చేయాలి : జిల్లా కలెక్టర్ అంకిత్..



సీ కే న్యూస్ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రతినిధి, జూలై 13, కొత్తగూడెం తహసీల్దార్ కార్యాలయాన్ని జిల్లా కలెక్టర్ అంకిత్ సోమవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కార్యాలయంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక ఓటరు జాబితా సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) హెల్ప్‌డెస్క్‌ను పరిశీలించారు.

కొత్తగూడెం పరిధిలోని 66 పోలింగ్ కేంద్రాల్లో బీఎల్‌వోలు ఫారాల పంపిణీ కార్యక్రమాన్ని సక్రమంగా నిర్వహిస్తున్నారా, ఓటర్లు నింపిన ఫారాలను తిరిగి స్వీకరిస్తున్నారా అని సంబంధిత అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఫారాల పంపిణీ, స్వీకరణ ప్రక్రియను మరింత వేగవంతం చేయాలని ఆదేశించారు.

బీఎల్‌వోలు సేకరించిన ఫారాలను ఎప్పటికప్పుడు డిజిటలైజ్ చేయాలని, డిజిటలైజేషన్ ప్రక్రియను ఆపరేటర్లు అత్యంత అప్రమత్తంగా, ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా నిర్వహించాలని సూచించారు. డిజిటలైజేషన్‌లో నాణ్యతా ప్రమాణాలు తప్పనిసరిగా పాటించాలని ఆదేశించారు.

ఓటర్లకు ఫారాలు పూరించే విధానంపై అవగాహన కల్పిస్తూ అవసరమైన సహాయ సహకారాలు అందించాలని, ఇంటి వద్ద అందుబాటులో లేని ఓటర్లను ఫోన్ ద్వారా సంప్రదించి వివరాలు సేకరించి వారికి ఫారాలు అందేలా చర్యలు చేపట్టాలని సూచించారు. బీఎల్‌వోలు తమకు కేటాయించిన పరిధిలో అందుబాటులో లేని ఓటర్ల వివరాలను సంబంధిత బీఎల్‌వో సూపర్వైజర్లకు వెంటనే తెలియజేసి, ఫారాల పంపిణీ ప్రక్రియను నిర్దేశిత గడువులో పూర్తి చేయాలని ఆదేశించారు.

ఈ సందర్భంగా తహసీల్దార్ పుల్లయ్య మాట్లాడుతూ, కొత్తగూడెం పరిధిలో 66 పోలింగ్ కేంద్రాలు ఉండగా, వాటి పర్యవేక్షణకు ఏడుగురు బీఎల్‌వో సూపర్వైజర్లు విధులు నిర్వహిస్తున్నట్లు జిల్లా కలెక్టర్‌కు వివరించారు.

## కేంద్ర బొగ్గు గనుల శాఖ మంత్రి కిషన్ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసిన జిల్లా కలెక్టర్ అంకిత్.



సీ కే న్యూస్ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రతినిధి జూలై 13,సింగరేణి భరోసా యాత్రలో పాల్గొనేందుకు జిల్లాకు విచ్చేసిన కేంద్ర బొగ్గు గనుల శాఖ మంత్రి కిషన్ రెడ్డిని సోమవారం ఇల్లందు క్రాస్ రోడ్‌లోని సింగరేణి గెస్ట్ హౌస్‌లో జిల్లా కలెక్టర్ అంకిత్ మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా మంత్రి కిషన్ రెడ్డికి మొక్కను అందజేసి జిల్లా యంత్రాంగం తరఫున ఘన స్వాగతం పలికారు. అనంతరం జిల్లాలో చేపట్టనున్న కార్యక్రమాలపై స్వల్పంగా చర్చించారు. ఈ సందర్భంగా సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# ఎన్ఎస్పీ కాలువ భూ ఆక్రమణ

- ఉపాధి హామీ మొక్కల నాటకంలో వెలుగులోకి వచ్చిన భూ ఆక్రమణ
- కాలువ రక్షిత ప్రాంతంలో పామాయిల్ మొక్కలు..
- సెలవు రోజున మొక్కల నాటకంపై అనుమానాలు..
- ఎన్ఎస్పీ కాలువ భూ ఆక్రమణపై పరిశీలన
- పామాయిల్ మొక్కలను పీకివేసిన అధికారులు
- వెలుగులోకి వచ్చిన ఆక్రమణ ఆనవాళ్లు
- విచారణ చేపట్టాలని స్థానికుల డిమాండ్



సీ కే న్యూస్ ప్రతినిధి ఇస్లావత్ నరసింహ ఏన్కూరు జులై 13 2026: ఏన్కూరు మండల పరిధిలోని నాగార్జునసాగర్ ప్రాజెక్టు (ఎన్ఎస్పీ) ప్రధాన కాలువకు ఆనుకుని ఉన్న ప్రభుత్వ రక్షిత భూమి ఆక్రమణకు గురైందనే ఆరోపణలు స్థానికంగా చర్చనీయాంశంగా మారాయి. ఉపాధి హామీ పథకం కింద కాలువ గట్లపై మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టిన సందర్భంగా ఈ విషయం వెలుగులోకి వచ్చింది.

స్థానికుల సమాచారం ప్రకారం, ఎన్ఎస్పీ ప్రధాన కాలువకు ఆనుకుని ఉన్న రక్షిత ప్రాంతంలో ఇటీవల సీతారామ ప్రాజెక్టు పనుల కోసం మట్టిని తరలించడంతో సుమారు నాలుగు ఎకరాల మేర భూమి చదునుగా మారింది. అనంతరం కాలువకు ఆనుకుని ఉన్న ఈ ప్రభుత్వ భూమిలో పామాయిల్ మొక్కలు నాటినట్లు గుర్తించారు. ప్రభుత్వ రక్షిత ప్రాంతంలో ఈ విధంగా సాగు చేపట్టడం పలు అనుమానాలకు తావిస్తోంది.

స్థానికుల ఆరోపణల ప్రకారం, ఆదివారం సెలవు రోజున ఆక్రమణ చేసినట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న రైతు పామాయిల్ మొక్కలు నాటించినట్లు చెబుతున్నారు. అనంతరం సోమవారం రోజున ఉపాధి హామీ పథకం కింద కాలువ గట్లపై మొక్కలు నాటే కార్యక్రమం కోసం అధికారులు అక్కడికి వెళ్లిన సమయంలో ఈ విషయం వారి దృష్టికి వచ్చింది.

సంఘటనా స్థలాన్ని డీఈ కే ఆనంద్, ఏఈ పూనంచంద్,ఎంపీడీవో పల్లి భాగ్యశ్రీ, ఏపీవో సూరయ్య,లస్కర్ పరిశీలించారు. పరిశీలన సందర్భంగా కాలువ రక్షిత ప్రాంతంలో నాటిన కొన్ని పామాయిల్ మొక్కలను తొలగించారు. ఆ ప్రాంతంలో ప్రభుత్వ నిబంధనలకు అనుగుణంగా పండ్ల మొక్కలు నాటే విధంగా చర్యలు తీసుకుంటామని అధికారులు తెలిపారు.

అయితే కాలువ రక్షిత ప్రాంతంలో పామాయిల్ మొక్కలు నాటే వరకు సంబంధిత శాఖల అధికారుల దృష్టికి ఈ విషయం ఎందుకు రాలేదనే ప్రశ్నలు స్థానికులు లేవనెత్తుతున్నారు. ప్రభుత్వ భూముల పరిరక్షణ బాధ్యత కలిగిన శాఖలు తరచూ పర్యవేక్షణ నిర్వహిస్తున్నప్పటికీ ఇంత పెద్ద స్థాయిలో భూమి వినియోగంలో మార్పులు ఎలా జరిగాయనే సందేహాలు వ్యక్తం చేస్తున్నారు.

ఈ వ్యవహారంపై నీటిపారుదల శాఖ, రెవెన్యూ శాఖ అధికారులు సంయుక్తంగా క్షేత్రస్థాయిలో సమగ్ర సర్వే నిర్వహించి కాలువ సరిహద్దులు, భూ రికార్డులను పరిశీలించి వాస్తవాలను నిర్ధారించాలని స్థానికులు కోరుతున్నారు. విచారణలో ప్రభుత్వ భూమి ఆక్రమణ జరిగినట్లు తేలితే ఆక్రమణకు పాల్పడిన వారిపై ఎలాంటి చర్యలు తీసుకుంటారు, ప్రభుత్వ భూమిని తిరిగి స్వాధీనం చేసుకుంటారా, చట్టపరమైన చర్యలు ఉంటాయా అనే అంశాలపై ప్రజల్లో ఆసక్తి నెలకొంది.

ప్రభుత్వ భూముల పరిరక్షణలో ఎలాంటి రాజీ లేకుండా పూర్తి స్థాయిలో విచారణ జరిపి వాస్తవాలను ప్రజలకు వెల్లడించడంతో పాటు, నిబంధనలు ఉల్లంఘించినట్లు తేలితే బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

## భద్రాచలంలో రూ.9.05 లక్షల విలువైన 13.900 కిలోల గంజాయి స్వాధీనం.



సీ కే న్యూస్ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రతినిధి జూలై 13,భద్రాచలం సమీపంలో ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు నిర్వహించిన తనిఖీల్లో రెండు ద్విచక్ర వాహనాల్లో అక్రమంగా తరలిస్తున్న 13.900 కిలోల ఎండు గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. ఈ ఘటనలో ఒడిశా రాష్ట్రానికి చెందిన నలుగురిని అరెస్ట్ చేసి, రెండు బైక్‌లు, మూడు సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. వీటి మొత్తం విలువ సుమారు రూ. 9.05 లక్షలు ఉంటుందని అధికారులు తెలిపారు.

ఉమ్మడి ఖమ్మం జిల్లా ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ వి. సోమిరెడ్డి, అసిస్టెంట్ కమిషనర్ ఆర్. కిషన్ ఆదేశాల మేరకు ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఎస్ఐ సి. హెచ్. శ్రీహరి రావు ఆధ్వర్యంలో సిబ్బంది కూనవరం--భద్రాచలం ప్రధాన రహదారిలోని ఇసుక రీచ్ వద్ద వాహన తనిఖీలు నిర్వహించారు.

ఈ సందర్భంగా ఒడిశా రిజిస్ట్రేషన్ నంబర్ ఓ డి 30 + 7886 గల కేటీఎం 390 డ్యూక్ బైక్‌ను తనిఖీ చేయగా 6.900 కిలోల ఎండు గంజాయి లభ్యమైంది. ఈ కేసులో మల్కాన్‌గిరి జిల్లాకు చెందిన సుశాంకర్ బిశ్వాస్, ప్రసంజీత్ చింతపాత్రలను అదుపులోకి తీసుకున్నారు.

అనంతరం ఓ డి 30 + 1537 నంబర్ గల రాయల్ ఎన్‌ఫీల్డ్ బైక్‌ను తనిఖీ చేయగా మరో 7 కిలోల ఎండు గంజాయి స్వాధీనం చేసుకున్నారు. ఈ కేసులో రోహిత్ గౌడ్, అలోక్ బెహరాలను అరెస్ట్ చేశారు. వీరంతా ఒడిశా నుంచి హైదరాబాద్‌కు గంజాయిని తరలిస్తున్నట్లు అధికారులు గుర్తించారు.

స్వాధీనం చేసుకున్న గంజాయి, రెండు ద్విచక్ర వాహనాలు, మూడు సెల్‌ఫోన్లను తదుపరి విచారణ నిమిత్తం భద్రాచలం ఎక్సైజ్ స్టేషన్‌కు తరలించారు.

తనిఖీల్లో హెడ్ కానిస్టేబుల్ ఖలీల్ అహ్మద్, కానిస్టేబుళ్లు పి. రాజు, వెంకన్న, ప్రసన్నకుమార్, తిరుపతి, ఉపేందర్ పాల్గొన్నారు.

ఈ సందర్భంగా గంజాయి లేదా ఇతర మత్తు పదార్థాల అక్రమ రవాణాకు సంబంధించిన సమాచారం తెలిసిన వారు టోల్‌ఫ్రీ నంబర్ 1800-425-2523కు సమాచారం అందించాలని, సమాచారదాత వివరాలు గోప్యంగా ఉంచుతామని ఎక్సైజ్ అధికారులు తెలిపారు.

# అభివృద్ధిపై అసత్య ప్రచారం మానుకోవాలి

- కాగితాలు కాదు... గ్రామాల్లోకి వెళ్లి అభివృద్ధిని చూడండి
- మాజీ ఎమ్మెల్యే అంజయ్య యాదవ్



సి కే న్యూస్ షాద్ నగర్ :జులై 13:ఇటీవల మీడియా సమావేశంలో ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ గారు "మండలాలు ఏర్పాటు చేశారు కానీ అభివృద్ధి చేయలేదు" అని చేసిన వ్యాఖ్యలు పూర్తిగా అవాస్తవమని మాజీ ఎమ్మెల్యే అంజయ్య యాదవ్ పేర్కొన్నారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత ముఖ్యమంత్రి కేసీఆర్ నాయకత్వంలోని బీఆర్ఎస్ ప్రభుత్వం కొత్త జిల్లాలు, కొత్త మండలాలు, కొత్త గ్రామపంచాయతీలను ఏర్పాటు చేసి పరిపాలనను ప్రజలకు మరింత చేరువ చేసింది. దశలవారీగా కలెక్టరేట్ భవనాలు, జిల్లా వైద్య కళాశాలలు, గ్రామపంచాయతీ భవనాలు, ప్రభుత్వ కార్యాలయాలు, బీటీ రోడ్లు, సీసీ రోడ్లు, ఇతర మౌలిక సదుపాయాలను అభివృద్ధి చేసింది. కరోనా వంటి క్లిష్ట పరిస్థితులు, ఆర్థిక ఇబ్బందులు ఎదురైనా సంక్షేమం, అభివృద్ధి కార్యక్రమాలు ఆగకుండా కొనసాగించింది. షాద్‌నగర్ నియోజకవర్గంలో నందిగామ, జిల్లేడు చౌదరిగూడెం మండలాలు ఏర్పడిన తర్వాత జరిగిన అభివృద్ధిని ప్రజలే ప్రత్యక్షంగా చూశారు. మండల కేంద్రాల్లో సీసీ రోడ్లు, గ్రామాలకు బీటీ రోడ్లు, కొత్తూర్--షాద్‌నగర్ రహదారి అభివృద్ధి, అనేక గ్రామీణ మౌలిక సదుపాయాలు బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలోనే పూర్తయ్యాయి.

ఎమ్మెల్యే శంకర్ గారు "కాగితాలు మాత్రమే తీసుకొచ్చారు, పనులు జరగలేదు" అని వ్యాఖ్యానించడం ఆశ్చర్యకరం. కాగితాల గురించి మాట్లాడే ముందు ఒక్కసారి గ్రామాల్లోకి వెళ్లి కళ్లారా అభివృద్ధి పనులు చూసి మాట్లాడండి. ఇప్పుడు మీరు రెండు బీటీ రోడ్లు తీసుకొచ్చి "మొత్తం అభివృద్ధి అంతా మేమే చేశాం" అని చెప్పడం ప్రజలను తప్పుదోవ పట్టించే ప్రయత్నమే. మీరు చేసిన పనులను ప్రజలు స్వాగతిస్తారు. కానీ గత పదేళ్లలో బీఆర్ఎస్ ప్రభుత్వం చేసిన వేలాది కోట్ల రూపాయల అభివృద్ధిని పూర్తిగా విస్మరించి, అంతా ఇప్పుడు మాత్రమే జరుగుతోందని ప్రచారం చేయడం సబబు కాదు. 2014కు ముందు పరిస్థితులు ఎలా ఉండేవో, బీఆర్ఎస్ పాలనలో ఎన్ని బీటీ రోడ్లు, సీసీ రోడ్లు, తాగునీటి పథకాలు, అభివృద్ధి పనులు జరిగాయో ప్రజలే చెబుతారు. అయితే గతంలో జరిగిన అభివృద్ధిని పూర్తిగా కాదని, "ఏమీ జరగలేదు" అనే విధంగా మాట్లాడటం ప్రజల విజ్ఞతను అవమానించడమేనని మాజీ ఎమ్మెల్యే అంజయ్య యాదవ్ అన్నారు.

## అయోధ్య రామాలయంలో దొంగతనంపై సీబీఐ విచారణ జరపాలి.

భద్రాచలంలో వీహెచ్ మౌన దీక్ష



సీ కే న్యూస్ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రతినిది జూలై 13, భద్రాచలం:అయోధ్యలోని శ్రీరామ మందిరంలో దొంగతనం జరగడంపై తెలంగాణ ప్రభుత్వ సలహాదారు, కాంగ్రెస్ సీనియర్ నేత వి. హనుమంతరావు (వీహెచ్) తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ ఘటనపై కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం తక్షణమే స్పందించి, సమగ్ర విచారణను సెంట్రల్ బ్యూరో ఆఫ్ ఇన్వెస్టిగేషన్ (సిబిఐ) కి అప్పగించాలని ఆయన డిమాండ్ చేశారు.ఈ దొంగతనం ఘటనను నిరసిస్తూ భద్రాచలంలో వీహెచ్ మౌన దీక్ష చేపట్టారు. సుమారు 30 నిమిషాల పాటు సాగిన ఈ దీక్ష ద్వారా ఆయన తన నిరసనను వ్యక్తం చేశారు.దీక్ష అనంతరం వీహెచ్ మాట్లాడుతూ..దేశంలోనే అత్యంత పవిత్రమైన అయోధ్య రాముడి గుడిలోనే దొంగతనాలు జరగడం అత్యంత దురదృష్టకరమని ఆవేదన వ్యక్తం చేశారు. ఇంతటి భారీ భద్రత ఉండే ఆలయంలో దొంగతనం జరగడం వెనుక ఉన్న అసలు సూత్రధారులను పట్టుకోవాలని, ఇందుకోసం నిష్పక్షపాతంగా సీబీఐ విచారణ జరిపించాల్సిన అవసరం ఎంతైనా ఉందని ఆయన కేంద్ర ప్రభుత్వాన్ని గట్టిగా డిమాండ్ చేశారు.

## ఏన్కూరులో డీవార్మింగ్ డే

విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్రలు



సీ కే న్యూస్ ప్రతినిధి ఇస్లావత్ నరసింహ ఏన్కూరు జులై 13 2026: జాతీయ నులిపురుగుల నిర్మూలన దినోత్సవం సందర్భంగా ఏన్కూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో సోమవారం స్థానిక కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయం (కేజీబీవీ)లో అవగాహన కార్యక్రమం నిర్వహించారు.

ఈ కార్యక్రమంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ బాలకృష్ణ విద్యార్థినులకు ఆల్బెండజోల్ మాత్రలను పంపిణీ చేశారు. అనంతరం నులిపురుగుల నివారణ, వ్యక్తిగత పరిశుభ్రత పాటించడం, వైద్యుల సూచన మేరకు ఔషధాలు తీసుకోవడం వల్ల కలిగే ఆరోగ్య ప్రయోజనాలపై విద్యార్థినులకు వివరించారు.

నులిపురుగుల నిర్మూలన ద్వారా పిల్లల్లో రక్తహీనత తగ్గడంతో పాటు, పోషకాహారం శరీరానికి సక్రమంగా అందడం, శారీరక మరియు మానసిక ఎదుగుదల మెరుగుపడుతుందని తెలిపారు. ప్రతి చిన్నారి ఆరోగ్యవంతమైన భవిష్యత్తు కోసం ఇటువంటి కార్యక్రమాలు ఎంతో ఉపయోగపడతాయని పేర్కొన్నారు.

ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ భాగ్యశ్రీ, కేజీబీవీ ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు, వార్డెన్లు, కేజీబీవీ సిబ్బంది, వైద్య మరియు ఆరోగ్య శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

# రంగారెడ్డి జిల్లా కలెక్టరేట్ ముందు "టిడబ్ల్యూజెఎఫ్" జర్నలిస్టుల ఆందోళన

- మీడియాపై ఇలాంటి వివక్ష ఎప్పుడు చూడలేదు..
- గల్లీ నుంచి ఢిల్లీ దాకా పోరాడుదాం..!
- జర్నలిస్టులపై రాజకీయాలు చేస్తున్న ప్రెస్ అకాడమీ చైర్మన్..
- ముఖ్యమంత్రిని బదనాం చేస్తున్న ప్రెస్ అకాడమీ చైర్మన్ శ్రీనివాస్ రెడ్డి
- టిడబ్ల్యూజేఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బసవ పున్నయ్య..
- ఈ సుద్దపూసల బండారం బయటపెట్టాలి - జర్నలిస్ట్ కేపీ
- గుర్తింపు కార్డులు కూడా ఇవ్వలేని ప్రభుత్వాలు సిగ్గుపడాలి - జిల్లా అధ్యక్షుడు గణేష్..
- కలెక్టర్ నారాయణ రెడ్డికి వినతిపత్రం సమర్పించిన జర్నలిస్టులు




**సి కే న్యూస్ షాద్ నగర్ :జులై 13:**సమాజంలో ఉన్న సమస్యలపై నిరంతరం పోరాడుతూనే ఉన్నాం.. ఇప్పుడు పోరాడే జర్నలిస్టులే సమస్యల్లో పడ్డారు.. అయినా వదిలి పెట్టేది లేదు.. మనకోసం మనమే పోరాడుదాం.. గల్లి నుంచి ఢిల్లీ దాకా మన పోరాటాన్ని కొనసాగిద్దాం.. అని తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్ (టిడబ్ల్యూజెఎఫ్) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బసవ పున్నయ్య అన్నారు. జర్నలిస్టుల సమస్యలపై రంగారెడ్డి జిల్లా కలెక్టరేట్ ముందు సోమవారం జిల్లా వ్యాప్తంగా జర్నలిస్టులు అక్కడికి చేరుకొని కార్యాలయ గేటు ముందు ఆందోళన నిర్వహించారు. టిడబ్ల్యూజేఎఫ్ రంగారెడ్డి జిల్లాకు అధ్యక్షుడు శేరీబాయి గణేష్ ఆధ్వర్యంలో జరిగిన ఈ ఆందోళన కార్యక్రమానికి జాతీయ, రాష్ట్ర, జిల్లా కౌన్సిల్ సభ్యులు దేవేందర్, ఎండి ఖాజాపాషా కేపి, శ్రీనివాసచారి, చంద్రశేఖర్, మన్సూర్ అలీ ఖాన్, శ్రీశైలం, నరసింహారెడ్డి, రాజశేఖర్ తదితరులతో పాటు షాద్ నగర్, ఇబ్రహీంపట్నం, అమన్ గల్, శంషాబాద్, చేవెళ్ల, శంకర్ పల్లి, షాబాద్, కడ్తాల్, తలకొండపల్లి, మహేశ్వరం, రాజేంద్రనగర్, శేరిలింగంపల్లి, గండిపేట్ తదితర ప్రాంతాల నుండి జర్నలిస్టులు పెద్ద ఎత్తున హాజరయ్యారు.

రంగారెడ్డి జిల్లా కలెక్టర్ నారాయణరెడ్డికి పలు డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని అందజేశారు. ముఖ్యంగా అక్రిడేషన్ కార్డు ప్రక్రియలో జరుగుతున్న అవకతవకలు తదితర విషయాలను కలెక్టర్ కు వివరించారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బసవ పున్నయ్య మాట్లాడుతూ.. చిన్న సమస్యల కోసం కూడా పోరాడాల్సిన పరిస్థితి జర్నలిస్టులకు ఏర్పడుతుందని, ఇది అత్యంత దారుణమని అన్నారు. ఇదంతా ప్రెస్ అకాడమీ చైర్మన్ ఆడిస్తున్న నాటకం అని, దీనిపై ప్రశ్నించడానికి వెళితే కనీసం అపాయింట్మెంట్ కూడా ఇవ్వలేదని స్పష్టం చేశారు. ప్రెస్ అకాడమీ చైర్మన్ తీరు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని బదనాం చేస్తుందని ఆరోపించారు. ఎలాంటి సమస్యలనైనా తమ వార్తల ద్వారా తెలియజేసే జర్నలిస్టులు చిన్న సమస్యల కోసం పోరాడాల్సిన దుస్థితి ప్రస్తుతం రంగారెడ్డి జిల్లాలో ఎదుర్కొంటున్నామని అన్నారు. 40 ఏండ్లుగా ఇళ్ల స్థలాల కోసం ఎదురు చూడాల్సిన పరిస్థితి ఎదురవుతుందని అన్నారు. రాష్ట్ర కేంద్ర ప్రభుత్వాల తీరును నిరసిస్తూ రైల్వే పాసు సమస్యలపై కేంద్ర ప్రభుత్వంతో పోరాడేందుకు త్వరలో జర్నలిస్టులు ఢిల్లీ వెళ్లాల్సి ఉందని తెలిపారు.

ఇక్కడ గల్లి అయిన అక్కడ ఢిల్లీ అయినా టిడబ్ల్యూజేఎఫ్ ఎవరిని వదిలిపెట్టే ప్రసక్తే లేదని హెచ్చరించారు. కొన్ని జర్నలిస్టు యూనియన్లు రాజకీయ పార్టీలలా వ్యవహరిస్తూ జర్నలిజంలో రాజకీయాలు తెచ్చి విభజించి పాలిస్తున్నారని ఆరోపించారు. దీనిపై ముఖ్యమంత్రిని, మంత్రి పొంగులేటిని కలిసి మాట్లాడటం జరిగిందన్నారు. జర్నలిస్టులకు రైలు, మెట్రో రైలులో కూడా ఉచిత ప్రయాణ సదుపాయం కల్పించాలని డిమాండ్ చేశామని తెలిపారు. అలాగే విద్య, వైద్యం విషయంలో సహకారం అందించాలని కోరారు. అర్హులైన ప్రతి జర్నలిస్టుకు గుర్తింపు అక్రిడేషన్ కార్డు ఇవ్వాలన్నారు.

### తీగ లాగుతాం.. డొంక కదిలిస్తాం..

టిడబ్ల్యూజేఎఫ్ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు కేపీ

కొంతమంది అధికారులు అంతా రూల్స్ ప్రకారమే వెళుతున్నామని బిల్డప్పులు ఇస్తున్నారు.. కానీ చదువురాని వాళ్లకు కూడా గుర్తింపు కార్డులు జారీ చేశారనీ, కానీ దశాబ్దాలుగా జర్నలిస్టులుగా పని చేస్తున్న వారిని మాత్రం పక్కన పెట్టారన్నారు. దీనిని వదిలిపెట్టేది లేదు.. తీగలాగితే డొంక కదిలిస్తాం.. అని టిడబ్ల్యూజేఎఫ్ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు జర్నలిస్ట్ కేపీ అన్నారు. జర్నలిస్టులకు జరుగుతున్న అన్యాయాలపై ఆయన తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. అక్రిడేషన్ గుర్తింపు కార్డుల విషయంలో ఇంత దారుణాన్ని ఇప్పటిదాకా చూడలేదని, జర్నలిస్టులను పనిగట్టుకొని కొందరు వెంటాడుతూ వేధిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అర్హత లేని వారికి ఎంతమందికి అక్రిడేషన్ కార్డులు ఇచ్చారు ఆ జాబితా తమ వద్ద ఉన్నాయని త్వరలోనే అక్రిడేషన్ ప్రక్రియ పూర్తయ్యాక అన్ని వివరాలు బయటపెడతామని హెచ్చరించారు. దీనిపై కలిసికట్టుగా పోరాటం చేయాల్సిన అవసరం ఉందన్నారు. సుద్దపూసల వ్యవహరిస్తున్న అధికారుల బండారాన్ని త్వరలోనే బయటపెడతామని హెచ్చరించారు. నిరంతరం వార్తల ద్వారా ప్రజల్లో ఉండి సేవలు అందిస్తూ, నాయకులకు ప్రచారం కల్పించే జర్నలిస్టుల పట్ల ఇలా వ్యవహరించడం సరికాదని పేర్కొన్నారు. చాలామంది జర్నలిస్టులను కార్డులు ఇవ్వకుండా వేధిస్తున్న ఈ తీరుపై పోరాటానికి సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. కనీస అవగాహన లేని, అక్షరం ముక్క రాయలేని జర్నలిస్టులకు కార్డులు ఇచ్చారు.. ఇంగ్లీషు రాయడం చేతకాని జర్నలిస్టులకు ఆంగ్ల పత్రికల్లో కార్డులు ఇచ్చారు.. ఫీల్డ్ కు సంబంధం లేని వారికి కూడా కార్డులు ఇచ్చారని, కానీ దశాబ్దాలుగా అంకితభావంతో సేవలు అందిస్తున్న జర్నలిస్టులను విస్మరించారని ఆవేదన వ్యక్తం చేశారు. దీనిపై పోరాడి హక్కులను సాధించుకుంటామని ఈ సందర్భంగా వెల్లడించారు.

### జర్నలిస్టును గుర్తించలేని ప్రభుత్వం సిగ్గుపడాలి..

టియుడబ్ల్యూఎఫ్ జిల్లా అధ్యక్షుడు గణేష్

సమాజానికి సేవలు అందిస్తున్న జర్నలిస్టులను గుర్తించలేని ప్రభుత్వం సిగ్గుపడాలని రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు గణేష్ అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గుర్తింపు కార్డుల ప్రక్రియలో పూర్తిస్థాయిలో పక్షపాత ధోరణి కొనసాగుతుందని ఆయన పేర్కొన్నారు. దీనిపై ప్రజాస్వామ్యయుతంగా పోరాటం చేయాల్సిన అవసరం ఉందన్నారు. ఎన్నికల ముందు కాంగ్రెస్ ప్రభుత్వం జర్నలిస్టులకు ఇచ్చిన హామీలను చూసి వారి తరఫున ప్రచారం చేసి గెలిపిస్తే గెలిచాక జర్నలిస్టులను పూర్తిగా పక్కన పెట్టారని ఆగ్రహం వ్యక్తం చేశారు. జర్నలిస్టులకు గుర్తింపు కార్డులు ఇవ్వడం, వైద్య సదుపాయం కల్పించడం, జర్నలిస్టుల పిల్లలకు కార్పొరేట్ పాఠశాలల్లో ఉచిత విద్య లక్ష్యంగా ఈ పోరాటం కొనసాగుతుందని వెల్లడించారు. సూర్య దినపత్రికను అదేవిధంగా మరికొన్ని దినపత్రికలను కక్షపూరిత ధోరణిలో పక్కన పెట్టారని ఇదంతా యూనియన్ల రాజకీయమని అన్నారు. ప్రెస్ అకాడమీ చైర్మన్ శ్రీనివాస్ రెడ్డి కక్షపూరిత రాజకీయాలు చేస్తున్నారని ఆరోపించారు. దీనివల్ల ప్రభుత్వం అప్రతిష్ట పాలవుతుందని ఎల్లప్పుడూ ప్రెస్ అకాడమీ చైర్మన్ గా శ్రీనివాస్ రెడ్డి ఉండడని అవకాశం మాకు కూడా వచ్చినప్పుడు తడాఖా చూపిస్తామని హెచ్చరించారు. ఇంతకు మునుపు ఎప్పుడూ ఇలాంటి పరిస్థితి చూడలేదు అన్నారు. హైదరాబాదులో ఈ నెల 15వ తేదీన జరిగే ధర్నాకు జిల్లా నలుమూలల నుంచి జర్నలిస్టులు పెద్ద ఎత్తున తరలిరావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో రంగారెడ్డి జిల్లాలోని ఆయా ప్రాంతాల జర్నలిస్టులు రఘు, నరేష్, గోపాల్, బుచ్చన్న, యాదగిరి, జగన్, నరసింహ, సురేంద్ర, శంకర్, కస్తూరి రంగనాథ్, ఎలక్ట్రానిక్ మీడియా షాద్ నగర్ అధ్యక్షులు ఆంజనేయులు గౌడ్, ప్రధాన కార్యదర్శి సాయినాథ్ రెడ్డి, శేఖర్ గౌడ్,రాకేష్, కృష్ణ, ధర్మ పాల్, శివ కుమార్, నరేందర్ గౌడ్, రామకృష్ణ, శ్రీకాంత్, ఆవుల రమేష్, శంకర్, షకీల్, రియాజ్,అన్వర్,ఖాలేద్,శ్యామ్ కుమార్, బూర్గుల రమేష్, మంచలం రమేష్, బండి గోపాల్, సత్యనారాయణ, రవి, రాజు రాజు నాయక్ తదితరులు పాల్గొన్నారు....

# పోలవరం ముంపును కప్పిపుచ్చేందుకే కాళేశ్వరంపై విమర్శలు

- మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డికి మాజీ మంత్రి పువ్వాడ అజయ్ కుమార్ కౌంటర్
- భద్రాచలం ప్రాంతంలో 184 చ.కి.మీ, 36 గ్రామాలపై పోలవరం ముంపు ప్రభావం



**సి కే న్యూస్ ప్రతినిధి ఖమ్మం :** కాళేశ్వరం ప్రాజెక్టులో నీటిని నిల్వ చేస్తే భద్రాచలం పట్టణంతో పాటు 44 గ్రామాలు ముంపునకు గురవుతాయని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి అవగాహన లేకుండా మాట్లాడుతున్నారని మాజీ మంత్రి పువ్వాడ అజయ్ కుమార్ విమర్శించారు. భద్రాచలం ప్రాంతానికి ముంపు ముప్పు కాళేశ్వరం వల్ల కాదని, దిగువన ఆంధ్రప్రదేశ్‌లో నిర్మిస్తున్న పోలవరం ప్రాజెక్టు బ్యాక్‌వాటర్ ప్రభావం వల్లనే ఉందని స్పష్టం చేశారు. ఈ విషయాన్ని కేంద్ర జల సంఘం (జఔజ), పోలవరం ప్రాజెక్టు అథారిటీ (ఫ్రాూ) కూడా అధికారికంగా గుర్తించిన అంశాన్ని మంత్రి ఉత్తమ్ తెలుసుకోవాలని పువ్వాడ సూచించారు.పోలవరం ముంపు సమస్యపై ప్రజల దృష్టి మరల్చేందుకే కాళేశ్వరం ప్రాజెక్టుపై తప్పుడు ప్రచారం చేస్తున్నారని పువ్వాడ మండిపడ్డారు. భద్రాచలం వద్ద గోదావరి నది బెడ్ లెవల్ సుమారు 26 మీటర్ల లోతులో ఉండగా, పోలవరం బ్యాక్‌వాటర్ ప్రభావం కారణంగా అక్కడ ఎప్పుడూ 13.15 మీటర్ల నుంచి 17.72 మీటర్ల వరకు నీటి మట్టం నిల్వ ఉంటుందని, ఇదే భద్రాచలం ప్రాంతంలో ప్రధాన సమస్యగా మారిందన్నారు. ఈ పోలవరం ముంపు నివారణకు భద్రాచలం ప్రాంత ప్రజల రక్షణకై ప్రభుత్వం చర్యలు తీసుకోకుండా కనీస సమీక్ష జరపకుండా కాళేశ్వరంపై తప్పుడు ప్రచారం చేస్తోందని పేర్కొన్నారు.పోలవరం బ్యాక్‌వాటర్ ప్రభావంతో భద్రాచలం పరిసర ప్రాంతాల్లోని 36 గ్రామాల పరిధిలో సుమారు 184 చదరపు కిలోమీటర్ల విస్తీర్ణం ముంపు ప్రభావానికి గురయ్యే అవకాశం ఉందని తెలిపారు. ఇలాంటి అత్యంత జఠిలమైన, ప్రజల జీవనానికి సంబంధించిన సమస్యను పక్కదారి పట్టిస్తూ కాళేశ్వరం ప్రాజెక్టుపై అసత్య ప్రచారం చేయడం బాధ్యతారాహిత్యం అని విమర్శించారు. గతంలో బీఆర్ఎస్ ప్రభుత్వం పోలవరం బ్యాక్‌వాటర్ ముంపు సమస్యపై కేంద్ర ప్రభుత్వం దృష్టికి పలుమార్లు తీసుకెళ్లి, భద్రాచలం ప్రాంత ప్రజల హక్కుల కోసం పోరాటం చేసిందని మాజీ మంత్రి పువ్వాడ అజయ్ కుమార్ గుర్తు చేశారు.

# ఘనంగా ఎమ్మెల్యే సతీమణి శ్రీమతి బండ్ల జ్యోతి గారు జన్మదిన వేడుకలు

- విద్యార్థులకు బ్యాగుల పంపిణీ ఎమ్మెల్యే సతీమణి గారు




**సి కె న్యూస్ ప్రతినిధి గద్వాల :**ఈరోజు గద్వాల నియోజకవర్గంలోని గద్వాల్ మండలం పూడూరు గ్రామం నందు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గద్వాల ఎమ్మెల్యే శ్రీ బండ్ల కృష్ణమోహన్ రెడ్డి గారి సమక్షంలో ఎమ్మెల్యే సతీమణి శ్రీమతి ఒశ్రీ బండ్ల జ్యోతి కృష్ణమోహన్ రెడ్డి గారి జన్మదిన సందర్భంగా గ్రామ సర్పంచ్ బుజ్జన్న, దీఖవీ= యువసేన సభ్యుడు పూడూర్ పాండు ఆధ్వర్యంలో విద్యార్థులకు బ్యాగుల పంపిణీ, కేక్ కటింగ్ చేసి జన్మదిన శుభాకాంక్షలు తెలిపిన శాలువా కప్పి పుష్పగుచ్ఛం ఇచ్చి ఘనంగా తో ఘనంగా సత్కరించారు ....

పాఠశాలలు చదువుతున్న విద్యార్థులకు సర్పంచ్ యువ నాయకులు ఆధ్వర్యంలో ఎమ్మెల్యే సతీమణి శ్రీమతి బండ్ల జ్యోతి వదినమ్మ గారి చేతుల మీదుగా విద్యార్థులకు బ్యాగులను పంపిణీ చేయడం జరిగింది...

ఈ కార్యక్రమంలో నాయకులు పూడూరు శ్యామ్,కేశవరెడ్డి, నరేందర్ రెడ్డి వెంకట్ రెడ్డి, శ్రీనివాసులు గోపాల్ రెడ్డి రంగయ్య గౌడ్ తిరుమల్ రెడ్డి రఫీ రంగారెడ్డి భాను ప్రకాష్ అశోక్ నాయకులు కార్యకర్తలు పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

# రూ. 20 లక్షలతో నిర్మిస్తున్న సీసీ రోడ్డు పనులను పరిశీలించిన బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్



**సి కె న్యూస్ ప్రతినిధి** నెరడిగొండ మండల కేంద్రంలోని న్యూ హనుమాన్ కాలనిలో రూ. 20 లక్షలతో నిర్మిస్తున్న సీసీ రోడ్డు పనులను సోమవారం బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ... రోడ్డు నిర్మాణంలో నాణ్యత పాటించాలని కాంట్రాక్టర్ కు ఆదేశించారు. ప్రతీ కాలనీల్లో అన్ని సీసీ రోడ్లను వెయిస్తామని ఈ సందర్భంగా తెలిపారు. కార్యక్రమంలో సర్పంచుల సంఘం అధ్యక్షులు నీలిమ రవీందర్ రెడ్డి, మాజీ ఎంపీపీ రాథోడ్ సజన్, మాజీ ఉప సర్పంచ్ దేవేందర్ రెడ్డి తదితరులు ఉన్నారు

# SIR కార్యక్రమాన్ని దగ్గరుండి నిర్వహిస్తున్న 21వ వార్డు కౌన్సిలర్



**సి కె న్యూస్ ప్రతినిధి గద్వాల** :ఈరోజు జోగులాంబ గద్వాల జిల్లా కేంద్రంలో గద్వాల గ్రామంలో 21వార్డు.శ్రీ నల్లకుంట ప్రాధాన్య పాఠశాల నందు ూ×= సమగ్ర సర్వేల వివరాలు దగ్గరుండి రాయిస్తున్న వార్డు కౌన్సిలర్ పులిపాటి వెంకటేష్ మరియు దీూ. శాంతమ్మ. మరియు రెవిన్యూ డిపార్ట్మెంట్ ఆర్ ఐ వెంకటేశ్వర్ రెడ్డి గారు పర్యవేక్షణ చేస్తూ ఓటర్లను తెచ్చిన ఫామ్స్ ని సక్రమంగా పూర్తి చేసి. బి ఎల్ ఓ కి.ఎశ్రీు. గణేష్ చిన్ని కృష్ణ మరియు వార్డ్ ఆఫీసర్ లక్ష్మి తదితరులు ఓటర్లు దగ్గరుండి అప్లికేషన్ రాయించుకుంటున్నారు

వార్డు కౌన్సిలర్ పులిపాటి వెంకటేష్ దగ్గరుండి పర్యవేక్షిస్తున్నారు

# గాయపడ్డ కార్మికులకు మెరుగైన వైద్య సేవలు అందించాలి.

**ఫార్మాసిటీ స్టాఫ్ అండ్ వర్కర్స్ యూనియన్ గౌరవ అధ్యక్షులు గనిశెట్టి డిమాండ్.**

**పరవాడ, సీకే న్యూస్ ప్రతినిధి** ఫార్మా సిటీలో టోరెంట్ ఫార్మా పరిశ్రమలో సల్ఫ్యూరిక్ యాసిడ్ పడి ఇద్దరు కార్మికులు గాయపడ్డారు. ఎన్. నాగరాజు కెమిస్ట్ ముఖం పై, కుడి భుజం పైన కాలిన గాయాలయ్యాయి. దీని పై సమగ్ర విచారణ చేసి గాయపడ్డ కార్మికులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని ఫార్మాసిటీ స్టాఫ్ అండ్ వర్కర్స్ యూనియన్ గౌరవ అధ్యక్షులు గనిశెట్టి సత్యనారాయణ డిమాండ్ చేశారు. సోమవారం తెల్లవారు జరిగిన ఈ ప్రమాదంలో సల్ఫ్యూరిక్ యాసిడ్ కింది నుండి చైన్ సహాయంతో ఫస్ట్ ఫ్లోర్ కి తరలిస్తుండగా ఒక్కసారిగా చైన్ తెగిపోవడంతో ఒక్కసారిగా డ్రమ్ము కిందపడి పగిలిపోయింది. దీంతో పక్కనే ఉన్న నాగరాజు మరో కార్మికులకు ప్రమాదానానికి గురయ్యారు. దీని పై సమగ్ర విచారణ చేసి చర్యలు చేపట్టాలని గనిశెట్టి డిమాండ్ చేశారు.

# బోథ్ గ్రామ పంచాయతీ వార్డు సభ్యులకు గౌరవ వేతనం కల్పించాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి




**సి కె న్యూస్ ప్రతినిధి** బోథ్ గ్రామ పంచాయతీ వార్డు సభ్యులు తమ శ్రమ, సేవలను గుర్తించి, ప్రస్తుతం సర్పంచ్‌లకు అందిస్తున్న విధంగానే ప్రతి వార్డు సభ్యునికి నెలకు రూ.3,000 గౌరవ వేతనం మంజూరు చేయాలని రాష్ట్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.

గ్రామాల్లో ప్రజలకు అత్యంత చేరువగా ఉండి, తమ వార్డులలో నెలకొనే సమస్యలను గుర్తించి, సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లడంతో పాటు వాటి పరిష్కారం కోసం నిరంతరం కృషి చేసేది వార్డు సభ్యులేనని తెలిపారు. ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉండి గ్రామాభివృద్ధిలో కీలక పాత్ర పోషిస్తున్న వార్డు సభ్యుల సేవలను ప్రభుత్వం గుర్తించి తగిన గౌరవ వేతనం అందించాలని కోరారు.

గ్రామస్థాయి ప్రజాప్రతినిధులుగా వార్డు సభ్యుల బాధ్యతలు, సేవలను పరిగణనలోకి తీసుకొని ప్రతి నెల రూ.3,000 గౌరవ వేతనం మంజూరు చేసేలా ప్రభుత్వం సానుకూల నిర్ణయం తీసుకోవాలని ఈ సందర్భంగా విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో సీనియర్ వార్డు సభ్యులు కట్ట భూమేష్, కదం వినయ్ కుమార్, షేక్ షాకీర్, కరిపె శ్రీను, మేడిచల్మ రూప, రాయలు తిరుపతి, సాయికుమార్, భారే ఐశ్వర్య, మాహుర్కర్ లక్ష్మి తదితరులు పాల్గొన్నారు

# ఎర్రకుంట తండాకు బస్సు సౌకర్యంకల్పించాలి

**నిరుద్యోగ జేఏసీ కన్వీనర్ ధరావత్ నరసింహ**

**చింతలపాలెం సీకే న్యూస్ ప్రతినిధి సందీప్ నాయక్ గుగులోతు** మండల పరిధిలోని ఎర్రకుంట తండా కు కోదాడ డిపో నుండి బస్సు సౌకర్యం కల్పించాలి అని నిరుద్యోగ జేఏసీ కన్వీనర్ ధరావత్ నరసింహ నాయక్ అన్నారు ఇప్పటివరకు బస్సు సౌకర్యం లేదు తెలంగాణ ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఫ్రీ బస్సు పథకమును ఎర్రకుంట తండా గ్రామవాసులు ఇప్పటి వరకు ఉపయోగించుకున్నదే లేదు బస్సు సౌకర్యం లేక విద్యార్థి , విద్యార్థులు సకాలంలో పాఠశాలకు కళాశాలలకు చేరుకోలేకపోతున్నారు మహిళల కోసం ప్రవేశపెట్టిన ఫ్రీ బస్సు మా తండా మహిళలు ఈ పథకమును ఉపయోగించుకున్నదే లేదు మల్లారెడ్డిగూడెం నుండి చింతిర్యాలకు వెళ్లే బస్సుకు మార్గమధ్యంలో మా ఎర్రకుంట తండా కలుస్తుంది కావున ఆ బస్సును మా ఎర్రకుంట తండా నుండి వెళ్లేటట్లు చొరవ తీసుకోవాలని కోదాడ డియమ్ శ్రీనివాసులు కి వినతి పత్రం ఇవ్వడం జరిగింది ఇట్టి కార్యక్రమంలో లంబాడ హక్కుల పోరాట సమితి జాతీయ కమిటీ అధ్యక్షులు బానోతు వెంకట్రాం నాయక్ నిరుద్యోగ జేఏసీ కన్వీనర్ ధరావత్ నరసింహ, గ్రామ అధ్యక్షులు భూక్యా శివరాం మరియు తదితరులు పాల్గొన్నారు



# ప్రతి ఒక్కరూ ఒక్క చెట్టు నాటండి పర్యావరణాన్ని కాపాడండి

గ్రామ సర్పంచ్ బానోతు అరుణ రమేష్



గరిడేపల్లి సికె న్యూస్ ప్రతినిధి సందీప్ నాయక్ గుగులోతు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న వన మహోత్సవం కార్యక్రమాన్ని గరిడేపల్లి మండలం గారకుంటతండ గ్రామంలో ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా గ్రామ సర్పంచ్ బాణోతు అరుణ రమేష్ నాయక్ గ్రామ పెద్దలతో కలిసి మొక్కలు నాటారు. అనంతరం మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ చెట్లను రక్షిస్తే ఆ మొక్కలు మన పర్యావరణాన్ని కాపాడుతాయని అన్నారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ గౌతమి సుధాకర్, గరిడేపల్లి మాజీ సర్పంచ్ బాణోతు మంగతి సైదానాయక్, పంచాయతీ కార్యదర్శి నాగరాజు, వార్డు సభ్యులు బూలీ బాయి, ఝాన్సీ బాయి, జయరాం, జలేంధర్, సైదానాయక్, సక్కి, సావిత్రి, ఫీల్డ్ అసిస్టెంట్ వెంకటరెడ్డి, యూత్ అధ్యక్షుడు వీరునాయక్, అంగన్వాడీ టీచర్ కవిత, ఆశవర్కర్ భవాని, విఓఏ సుధాకర్, గ్రామ పెద్దలు దీప్లానాయక్, సైదానాయక్, లాలూ, దేవేందర్, పాండు, సాంపు, నాగు, మహిళలు గుగులోతు పరమేశ్వరి సైదమ్మ దాని మన్ని రజిత గ్రామపంచాయతీ సిబ్బంది వెంకటమ్మ తదితరులుపాల్గొన్నారు.

## పాఠశాల విద్యార్థులకు ఎన్డిటిటి టాబ్లెట్లు పంపిణీ

- సూర్యాపేట జిల్లా సర్పంచుల ఫోరం అధ్యక్షులు గుండు రామాంజి గౌడ్..



గరిడేపల్లి సికె న్యూస్ ప్రతినిధి సందీప్ నాయక్ గుగులోతు పిల్లల కు టాబ్లెట్ వేసి మంచి సదవకాశాన్ని పిల్లలు సద్వినియోగం చేసుకోవాలని

ఈ రోజు రాయినిగూడెం హైస్కూల్లో జాతీయ నూలు పురుగుల నివారణ దినోత్సవం సందర్భంగా సంవత్సరం నుండి 19 సంవత్సరాలు నిండిన పిల్లలందరికీ అల్బెండజోలు టాబ్లెట్ వేయటం జరిగింది .ఈ టాబ్లెట్ పాఠశాలలో అంగన్వాడీ సెంటర్లలో ఉచితంగా ఇవ్వబడుతుంది ఆరోగ్య అండ్ కుటుంబ సంక్షేమ శాఖ వారు ఈ అరుదైన పథకాన్ని జారీ చేశారు ఈ సదవకాశాన్ని అంగన్వాడి పిల్లలు ప్రైమరీ స్కూల్ పిల్లలు హైస్కూల్ పిల్లలు అందరూ సద్విని చేసుకోగలరని గ్రామ సర్పంచ్ గుండు రామాంజిగౌడ్ సూచించారు కార్యక్రమంలో ఉపసర్పంచ్ నాగరాజు డాక్టర్ జుట్టుకొండ సుష్మ అసిస్టెంట్ డాక్టర్ సరస్వతి స్కూల్ హెడ్మాస్టర్ నాగమణి ఆశ వర్కర్ నాగమణి పిఇటి ప్రదీప్ తదితరులు పాల్గొన్నారు

## తెలంగాణలోని జర్నలిస్టుల సమస్యలు పరిష్కరించాలి

- టి డబ్ల్యూ జె ఎఫ్
- హనుమకొండ జిల్లా కోశాధికారి ఇసంపల్లి రమేష్



సి.కే న్యూస్ జూలై 13 సోమవారం హనుమకొండ జిల్లా ధర్మసాగర్ మండలం ప్రతినిధి కమలాకర్

జర్నలిస్టుల సమస్యలు పరిష్కరించాలని హనుమకొండ జిల్లా కోశాధికారి ఇసంపల్లి రమేష్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం టీ డబ్ల్యు జే ఎఫ్ రాష్ట్ర సంఘం పిలుపుమేరకు జిల్లాల వారీగా కలెక్టరేట్ నిరసన కార్యక్రమంలో భాగంగా ధర్మసాగర్ మండల కేంద్రం నుండి టి డబ్ల్యూ ఎఫ్ నాయకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జర్నలిస్టు ఎదుర్కొంటున్న సమస్యల గురించి పరిష్కరించే విధంగా రాష్ట్ర సంఘ అధికారులు ప్రజాప్రతినిధులు సానుకూలంగా స్పందించి వారి సమస్యలను పరిష్కరించే విధంగా చర్యలు చేపట్టాలని కోరారు.కాంగ్రెస్ రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల వివరించిన విధంగా అర్హులైన జర్నలిస్టులందరికీ నివేషణ స్థలాలను ఇందిరమ్మ ఇళ్లలో కేటాయించాలని ఆరోపించారు.అర్హులైన జర్నలిస్టులందరికీ అక్కడేషన్ కార్డుతో పాటు వారికి రాష్ట్రవ్యాప్తంగా ఫ్రీ బస్సు సౌకర్యం కల్పించాలని అన్నారు. అదేవిధంగా ఆరోగ్య సమస్యలతో బాధపడుతున్న వారి కుటుంబాలకు ఆరోగ్య బీమా పథకాన్ని అమలు చేయాలని అన్నారు.అంతేకాకుండా ఆర్టీసీ బస్సు సౌకర్యం వారికి ఫ్రీ బస్సు సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వానికి ప్రజలకు వారిదిగా ఉన్న వారికి రైల్వే శాఖలో కూడా ఫ్రీ ప్రయాణ సౌకర్యం కల్పించాలని ఈ సందర్భంగా వారి యొక్క విన్నపాన్ని విన్నవించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు పోలిమారి గోపాల్, జిల్లా కమిటీ ఈసీ మెంబర్లు గజ్జల సుమన్, నాగవెల్లి దుర్గరాజు,సభ్యులు ఇమ్మడి కమలాకర్, పోలుమారి ప్రఫూల్ కుమార్, బంక శివలాల్ యాదవ్, పెసర ఆగయ్య, పోలుమారి ప్రమోద్ పాల్, అనిల్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# అర్హులైన ప్రతి ఒక్కరికి ఓటు హక్కు కల్పించాలి.

సబ్ కలెక్టర్ మృనాల్ శ్రేష్ట.

సీ కే న్యూస్ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రతినిధి, జూలై 13, ప్రత్యేక సమగ్ర ఓటర్ల జాబితా సవరణ ఎస్ ఐ ఆర్ ప్రక్రియను ఆకస్మికంగా తనిఖీ చేసి ఎన్యుమరేషన్ ఫారాలలో ఓటర్ల నమోదు తీరును భద్రాచలం సబ్ కలెక్టర్ మృనాల్ శ్రేష్ట పరిశీలించి పలు సూచనలు అందించారు.

సోమవారం భద్రాచలం పట్టణంలోని వెంకటేశ్వర కాలనీ మెడికల్ కాలనీ లలో ఇంటింటా చేపడుతున్న ప్రత్యేక సమగ్ర ఓటర్ల జాబితా సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియను సబ్ కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఓటర్లకు ఎన్యూమరేషన్ ఫారాల పంపిణీ, వివరాల నమోదు, అవగాహన కల్పన తదితర అంశాలను క్షేత్రస్థాయిలో పరిశీలించి బూత్ లెవల్ అధికారులు (బీఎల్వోలు)తో మాట్లాడారు కాలనీలలో ఇప్పటివరకు పంపిణీ చేసిన ఎన్యూమరేషన్ ఫారాల వివరాలు, విధులు నిర్వహిస్తున్న బీఎల్వోల సంఖ్య, క్షేత్రస్థాయిలో ఎదురవుతున్న సమస్యలపై సబ్ కలెక్టర్ ఆరా తీశారు. సంబంధిత బీఎల్వోలు ఇంటింటికీ వెళ్లి ఫారాల పంపిణీతో పాటు ఓటర్లకు ఎస్ఐఆర్ ప్రక్రియపై అవగాహన కల్పిస్తూ నిర్ణీత గడువులోగా ఫారాల సేకరణ చేపడుతున్నట్లు సబ్ కలెక్టర్కు తెలిపారు.

ఈ సందర్భంగా సబ్ కలెక్టర్ మాట్లాడుతూ ప్రత్యేక సమగ్ర ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియను భారత ఎన్నికల సంఘం మార్గదర్శకాల మేరకు పూర్తి పారదర్శకంగా, పకడ్బందీగా నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. ప్రతి ఇంటిని బీఎల్వోలు తప్పనిసరిగా సందర్శించి అర్హులైన ప్రతి ఓటరికి ఎన్యూమరేషన్ ఫారాలను అందజేయాలని, ఓటర్ల సందేహాలను నివృత్తి చేస్తూ పూర్తి అవగాహన కల్పించాలని సూచించారు.

ఓటరు జాబితా సవరణ ప్రక్రియలో ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా నిబంధనల మేరకు విధులు నిర్వహించాలని ఆదేశించారు. ఓటర్ల నుంచి ఎన్యూమరేషన్ ఫారాలను నిర్ణీత గడువులోగా స్వీకరించి, అందులోని వివరాలను క్షుణ్ణంగా పరిశీలించాలని అన్నారు . అర్హులైన ప్రతి ఓటరు పేరు ఓటరు జాబితాలో నమోదయ్యేలా ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సూచించారు.

క్షేత్రస్థాయిలో ఎదురవుతున్న సమస్యలను వెంటనే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువచ్చి సత్వర పరిష్కారం చూపాలని, ఎలాంటి ఇబ్బందులు లేకుండా ప్రత్యేక సమగ్ర ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియను విజయవంతంగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు.

ప్రజాస్వామ్య వ్యవస్థను మరింత బలోపేతం చేసే ఈ కీలక కార్యక్రమానికి ప్రజలు పూర్తి సహకారం అందించాలని సబ్ కలెక్టర్ కోరారు. అధికారులు, బీఎల్వోలు పూర్తి బాధ్యతతో విధులు నిర్వహించి ఓటర్ల జాబితా సవరణను నిష్పక్షపాతంగా, పారదర్శకంగా పూర్తి చేయాలని సూచించారు.

ఈ కార్యక్రమంలో బిఎల్వోలు మరియు సూపర్వైజర్లు తదితరులు పాల్గొన్నారు.





# జీతంతోనే యువతకు జ్ఞానబాట



- 90 మందికి ఉచిత కంప్యూటర్ శిక్షణ సర్టిఫికెట్లు
- యువత నైపుణ్యాభివృద్ధికి ఎమ్మెల్యే చేయూత

పాలకుర్తి/తొర్రూరు(సి కే న్యూస్) ప్రతినిధి పల్లె దేవేందర్ గౌడ్ : ప్రజాప్రతినిధిగా అందుతున్న తన జీతాన్ని ప్రజాసేవకు వినియోగిస్తూ పాలకుర్తి ఎమ్మెల్యే యశస్విని రెడ్డి చేపట్టిన ఉచిత కంప్యూటర్ శిక్షణ కార్యక్రమం తొలి విడత పూర్తయింది. శిక్షణ పొందిన 90 మంది విద్యార్థులకు సోమవారం తొర్రూరులోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఆమె సర్టిఫికెట్లు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ... విద్యే యువతకు గొప్ప ఆస్తి, నైపుణ్యమే భవిష్యత్తుకు బలమైన పునాదని అన్నారు. ప్రస్తుతం ప్రతి ఉద్యోగార్థికి కంప్యూటర్ పరిజ్ఞానం అత్యవసరమని, ఆర్థిక ఇబ్బందుల కారణంగా శిక్షణకు దూరమవుతున్న యువతకు అవకాశాలు కల్పించాలనే ఉద్దేశంతో తన జీతం నుంచి ఉచిత శిక్షణ కార్యక్రమాన్ని ప్రారంభించినట్లు తెలిపారు. పాలకుర్తి నియోజకవర్గంలోని ప్రతి యువకుడు, యువతి ఉపాధి అవకాశాలను అందిపుచ్చుకుని ఉన్నత స్థాయికి చేరుకోవాలని ఆకాంక్షించారు. ప్రభుత్వ ఉద్యోగాలతో పాటు ప్రైవేట్ రంగంలోనూ విస్తృత అవకాశాలు ఉన్నాయని, వాటికి అవసరమైన నైపుణ్యాలను యువత తప్పనిసరిగా అలవర్చుకోవాలని సూచించారు. భవిష్యత్తులో మరింత మంది యువతకు ప్రయోజనం చేకూరేలా ఉచిత శిక్షణ కార్యక్రమాలను విస్తరిస్తామని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. శిక్షణ పొందిన విద్యార్థులు ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలుపుతూ, ఈ శిక్షణ తమ ఉద్యోగ అవకాశాలను మెరుగుపరుస్తుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ తూనం శ్రవణ్ కుమార్, వైస్ చైర్మన్ సోమా రజిని రాజశేఖర్, పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు, శిక్షణ సంస్థ ప్రతినిధులు, అధ్యాపకులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

# సింగరేణిలో చోటుచేసుకున్న కుంభకోణాలపై సిట్టింగ్ జడ్జి చేత విచారణ జరిపించాలి: ఎంపీ రవిచంద్ర

సింగరేణి బొగ్గు గనులను ప్రైవేట్ పరం చేయాలనే కుట్రను కేసీఆర్ నాయకత్వంలో అడ్డుకున్నం: ఎంపీ రవిచంద్ర

సింగరేణిలో కారుణ్య నియామకాలు వెంటనే పూర్తి చేయాలి,ఆదాయపు పన్ను వసూళ్లు నిలిపివేయాలి: ఎంపీ రవిచంద్ర




సి కె న్యూస్ ప్రతినిది:తెలంగాణ కొంగు బంగారం సింగరేణి బొగ్గు గనులను ప్రైవేట్ పరం చేయాలనే కేంద్ర ప్రభుత్వం కుట్రలను బీఆర్ఎస్ అధినేత కల్వకుంట్ల చంద్రశేఖర రావు అడ్డుకున్నారని పార్లమెంటరీ పార్టీ లీడర్, రాజ్యసభ సభ్యులు వద్దిరాజు రవిచంద్ర చెప్పారు.ప్రధాని నరేంద్రమోడీ పాలనలో తెలంగాణకు ఒరిగిందేమీ లేదని,ఆయనతో పాటు బీజేపీ నేతలు రాష్ట్ర ఏర్పాటును పలుమార్లు అవహేళన చేస్తూ మాట్లాడారని ఎంపీ రవిచంద్ర ఆవేదన వ్యక్తంచేశారు.ఎంపీ రవిచంద్ర ఖమ్మం తెలంగాణ భవన్ సోమవారం సాయంత్రం ఎమ్మెల్సీ తాతా మధుసూదన్ తదితర నాయకులతో కలిసి విలేకరులతో మాట్లాడారు.సింగరేణి బొగ్గు గనుల్లో తెలంగాణ 51, కేంద్ర ప్రభుత్వం 49 శాతం వాటాలు కలిగి ఉన్నాయన్నారు.దేశంలోని ఎయిర్ పోర్టులు,ఇతర గనులను ప్రైవేట్ వారికి కట్టబెట్టే కుట్ర జరిగినప్పుడు తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ ఆదేశానుసారం కొత్తగూడెంలో బీఆర్ఎస్, బొగ్గు గని కార్మిక సంఘం నాయకత్వాన పెద్ద ఎత్తున ధర్నాకు దిగి అడ్డుకున్న సందర్భాన్ని ఎంపీ రవిచంద్ర గుర్తు చేశారు.కార్మికుల పోరాట ఫలితంగానే తాడిచర్ల -2 గనిని సింగరేణికి అప్పగించడం జరిగినది తప్ప కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి దాయాదాక్షిణ్యాలపై కాదన్నారు.తెలంగాణ బిడ్డగా సింగరేణి సంస్థ పురోభివృద్ధికి మరింత కృషి చేయాల్సిందిగా కిషన్ రెడ్డిని బొగ్గు శాఖ సంప్రదింపుల కమిటీ సభ్యుడిగా ఉన్న తాను పలుమార్లు కలిసి కోరడం జరిగిందన్నారు.తెలంగాణ రాష్ట్ర ఏర్పాటుకు ముందు సింగరేణి సంస్థ నష్టాల బాటలో ఉండగా, కేసీఆర్ దానిని 2023 డిసెంబర్ నాటికి 3200 కోట్ల లాభాలతో అప్పగించారని ఎంపీ వద్దిరాజు వివరించారు.కేసీఆర్ కారుణ్య నియామకాలు చేపట్టి 16000 మంది యువకులకు ఉద్యోగాలిస్తే, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రభుత్వం అర్థంలేని కారణాలు చూపి అడ్డుకోవడం శోచనీయమన్నారు.సింగరేణిలో చోటుచేసుకున్న కుంభకోణాలపై మాజీ మంత్రులు కే.టీ.రామారావు, హరీష్ రావులు కిషన్ రెడ్డికి లేఖలు రాస్తే సరైన సమాధానం ఇవ్వకుండా తప్పించుకుంటున్నారని ఎంపీ రవిచంద్ర విమర్శించారు.రేవంత్ రెడ్డి ఖమ్మం జిల్లాకు ఇప్పటివరకు 5 సార్లు వచ్చారని,ఇచ్చిన ఏ ఒక్క హామీని నెరవేర్చకపోగా తిట్ల పురాణంతో కాలం వెళ్లదీసి వెనుదిరిగారని దుయ్యబట్టారు.ముఖ్యమంత్రి తప్పిదాలను కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి నిలదీయకుండా ప్రధాన ప్రతిపక్షంపై విమర్శలు గుప్పిస్తుండడం తీవ్ర అభ్యంతరకరమని, వారిద్దరూ లోపాయికారి ఒప్పందాలతో ముందుకు సాగుతున్నట్లు ప్రజలు అనుకుంటున్నారని ఎంపీ రవిచంద్ర వ్యాఖ్యానించారు.సత్తుపల్లి,కోయగూడెం,శ్రావణపల్లి, కళ్యాణ ఖని తదితర గనులను సింగరేణి సంస్థకు అప్పగించాల్సిందిగా,కారుణ్య నియామకాలను వెంటనే చేపట్టాల్సిందిగా,ఆదాయపు చెల్లింపు నుంచి కార్మికులను విముక్తి చేయాల్సిందిగా ఎంపీ వద్దిరాజు కేంద్ర ప్రభుత్వాన్ని,కిషన్ రెడ్డిని డిమాండ్ చేశారు.ఈ సందర్భంగా బీఆర్ఎస్ ప్రచురించిన “రేవంత్ రెడ్డి మా రక్తం ఎంత కావాలో తీసుకో-కాళేశ్వరం నీళ్లను మాత్రం మన పంట పొలాలకి వ్వ”అనే పోస్టర్లను ఎంపీ రవిచంద్ర,ఎమ్మెల్సీ తాతా మధు తదితర నాయకులు ఆవిష్కరించారు.ఈ సమావేశంలో బీఆర్ఎస్ నాయకులు ఉప్పల వెంకటరమణ, బొమ్మెర రాంమూర్తి,గుండ్లపల్లి శేషగిరిరావు, పగడాల నాగరాజు,లక్కినేని సురేందర్, బెల్లం వేణు తదితరులు పాల్గొన్నారు.

## లిఅంగన్వాడి కేంద్రంలో నులిపురుగుల నివారణ మాత్రల పంపిణీ జగన్నాధపురం సర్పంచ్ తాళ్ళూరి స్వప్న చేతుల మీదుగా ప్రారంభం.



సి కే న్యూస్ చింతకాని ప్రతినిధి.చింతకాని మండలం జగన్నాధపురం గ్రామంలోని అంగన్వాడి కేంద్రంలో జాతీయ నులిపురుగుల నివారణ కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ తాళ్ళూరి స్వప్న చిన్నారులకు నులిపురుగుల నివారణ మాత్రలు అందించి కార్యక్రమాన్ని ప్రారంభించారు.ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ, నులిపురుగుల వల్ల పిల్లల ఎదుగుదల, ఆరోగ్యం, చదువుపై ప్రతికూల ప్రభావం పడే అవకాశం ఉందని, అందుకే ప్రభుత్వం చేపట్టిన ఈ కార్యక్రమాన్ని ప్రతి తల్లిదండ్రులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. సంవత్సరం నుంచి 19 సంవత్సరాల వయసు గల విద్యార్థులందరూ తప్పనిసరిగా ఈ మాత్రలు తీసుకోవాలని తెలిపారు.ఈ కార్యక్రమంలో... ప్రధానోపాధ్యాయులు ప్రభాకర్ రెడ్డి,అంగన్వాడి టీచర్ కాశీమాల వెంకమ్మ, ఆశా వర్కర్ బందెల అరుణ, ఆయా పద్మ,గ్రామ పెద్దలు, తల్లిదండ్రులు, తదితరులు, పాలుగోన్నారు.

## నాగులవంచ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో నులిపురుగుల నివారణ మాత్రల పంపిణీ



సి కే న్యూస్ చింతకాని ప్రతినిధి.చింతకాని మండలం నాగులవంచ గ్రామంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో జాతీయ నులిపురుగుల నివారణ కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని గ్రామ సర్పంచ్ నారగాని రాంబాయి ప్రారంభించి విద్యార్థులకు నులిపురుగుల నివారణ మాత్రలు పంపిణీ చేశారు.ఈ సందర్భంగా సర్పంచ్ నారగాని రాంబాయి మాట్లాడుతూ, నులిపురుగుల వల్ల పిల్లల ఎదుగుదల, ఆరోగ్యం, పోషకాహార లోపం మరియు చదువుపై ప్రతికూల ప్రభావం పడుతుందని తెలిపారు. అందువల్ల ప్రభుత్వం చేపట్టిన ఈ కార్యక్రమాన్ని ప్రతి విద్యార్థి సద్వినియోగం చేసుకోవాలని, తల్లిదండ్రులు తమ పిల్లలకు తప్పనిసరిగా నులిపురుగుల నివారణ మాత్రలు వేయించాలని సూచించారు.ఈ కార్యక్రమంలో.. ప్రభుత్వ ఉన్నత పాఠశాల హెచ్ఎం కనపర్తి వెంకటేశ్వర్లు, డాక్టర్ వేణుమాధవ్, ఏఎన్ఎం సుజాత, ఆశా వర్కర్ పడిశాల ఉమా, ఆయాలు, ఉపాధ్యాయులు, విద్యార్థులు, గ్రామ పెద్దలు, ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# సీతంపేట గ్రామ ప్రాథమిక పాఠశాల నందు విద్యార్థులకు నులిపురుగులు నివారణ మాత్రలు పంపిణీ చేసిన సర్పంచ్ ఆళ్ల మణి.



**సి కే న్యూస్ చింతకాని ప్రతినిధి.** మండల పరిధి సీతంపేట గ్రామ ప్రాథమిక పాఠశాల యందు విద్యార్థులకు నులిపురుగుల నివారణ మాత్రల పంపిణీ కార్యక్రమంను ప్రారంభించిన గ్రామ సర్పంచ్ ఆళ్ల మణి .

ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ జాల రమేష్, ప్రాధనోపాధ్యాయులు, ఆశ మరియు అంగన్వాడీ సిబ్బంది తదితరులు పాలొగొన్నారు

# మత్కేపల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో నులిపురుగుల నివారణ మాత్రల పంపిణీ





**సి కే న్యూస్ చింతకాని ప్రతినిధి.** చింతకాని మండలం మత్కేపల్లి గ్రామంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో జాతీయ నులిపురుగుల నివారణ కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని గ్రామ సర్పంచ్ కంచం ద్రౌపది ప్రారంభించి విద్యార్థులకు నులిపురుగుల నివారణ మాత్రలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ, నులిపురుగుల వల్ల పిల్లల ఎదుగుదల, ఆరోగ్యం, పోషకాహార లోపం మరియు చదువుపై ప్రతికూల ప్రభావం పడుతుందని తెలిపారు. అందువల్ల ప్రభుత్వం చేపట్టిన ఈ కార్యక్రమాన్ని ప్రతి విద్యార్థి సద్వినియోగం చేసుకోవాలని, తల్లిదండ్రులు తమ పిల్లలకు తప్పనిసరిగా నులిపురుగుల నివారణ మాత్రలు వేయించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో.. గ్రామ ఉప సర్పంచ్ పగడాల పుల్లమ్మ, ఉపాధ్యాయులు మరియు ఆశా వర్కర్లు విద్యార్థులు, గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

# నరసింహపురం-3 అంగన్వాడి కేంద్రంలో ఘనంగా శ్రీమంతం కార్యక్రమం



**సి కే న్యూస్ చింతకాని ప్రతినిధి.**

గర్భిణీ స్త్రీల ఆరోగ్యం, మానసిక ఆనందం, తల్లి--శిశు సంక్షేమాన్ని ప్రోత్సహించే లక్ష్యంతో చింతకాని సెక్టార్ పరిధిలోని నరసింహపురం-3 అంగన్వాడి కేంద్రంలో సోమవారం శ్రీమంతం కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. లి గర్భిణీ స్త్రీకి కుటుంబ సభ్యులు, బంధుమిత్రులు ఆశీర్వాదాలు అందించి, ఆరోగ్యవంతమైన శిశువు జన్మించాలని ఆకాంక్షిస్తూ నిర్వహించే ఈ కార్యక్రమం ఆమెకు మానసిక ధైర్యం, ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించడంలో కీలక పాత్ర పోషిస్తుంది. ప్రభుత్వం కూడా అంగన్వాడి కేంద్రాల ద్వారా ఇటువంటి కార్యక్రమాలను నిర్వహిస్తూ గర్భిణీలలో ఆరోగ్యంపై అవగాహన కల్పిస్తోంది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హాజరైన సూపర్వైజర్ సంధ్యారాణి, ఏఎన్ఎం రజిని మాట్లాడుతూ గర్భధారణ సమయంలో పౌష్టికాహారం తీసుకోవడం, ఐరన్, కాల్షియం మాత్రలను క్రమం తప్పకుండా వినియోగించడం, సమయానికి వైద్య పరీక్షలు చేయించుకోవడం, ప్రసవాన్ని ప్రభుత్వ ఆసుపత్రిలోనే సురక్షితంగా నిర్వహించుకోవడం వంటి అంశాలపై అవగాహన కల్పించారు. అలాగే తల్లి ఆరోగ్యంగా ఉంటేనే ఆరోగ్యవంతమైన శిశువు జన్మిస్తాడని పేర్కొన్నారు. అనంతరం గర్భిణీకి సంప్రదాయబద్ధంగా శ్రీమంతం నిర్వహించి ఆశీర్వదించారు. కార్యక్రమంలో అంగన్వాడీ టీచర్ రేణుక, ఆశా వర్కర్ జయమ్మ, చిన్నారుల తల్లులు, గ్రామ మహిళలు పాల్గొని గర్భిణీకి శుభాకాంక్షలు తెలిపారు.

# మల్టీ పర్పస్ కార్మికులకు ఇన్సూరెన్స్

**సి కె న్యూస్ కొల్చారం నర్సాపూర్** :మెదక్ జిల్లా కొల్చారం మండలం పోతంశెట్టిపల్లి గ్రామపంచాయతీ కార్మికులకు, గ్రామ సర్పంచ్ పాతూరి దయాకర్ గౌడ్ 15 లక్షల ప్రమాద బీమా ఇన్సూరెన్స్ చేయించడం జరిగింది, ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ పార్టీ దయాకర్ గౌడ్ ఉపసర్పంచ్ గుండు నాని, గ్రామ సెక్రెటరీ పోచయ్య, వార్డు మెంబర్లు సాయిని రాజు, చిట్యాల రవి, చాకలి అశోక్, నాయికోటి మహిపాల్,సగినాల దీవెన,తదితరులు పాల్గొన్నారు.

# చింతకానిలో జాతీయ డీ-వార్మింగ్ దినోత్సవం నిర్వహణ.. 1--19 ఏళ్ల వారికి నులిపురుగుల నివారణ మాత్రలు.




**సి కే న్యూస్ చింతకాని ప్రతినిధి.** చింతకాని : చింతకాని మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సోమవారం జాతీయ డీ-వార్మింగ్ దినోత్సవం (నేషనల్ డి వార్మింగ్ డే ) కార్యక్రమాన్ని నిర్వహించి, 1 నుంచి 19 సంవత్సరాల వయస్సు గల పిల్లలు, యువతకు నులిపురుగుల నివారణ మాత్రలను పంపిణీ చేశారు. గ్రామ సర్పంచ్ కిలారు మనోహర్ బాబు కార్యక్రమాన్ని ప్రారంభించారు.

ఈ సందర్భంగా మండల విద్యాధికారి ఎస్. రామారావు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డా. ఆల్తాఫ్, ప్రధానోపాధ్యాయురాలు తనూజ, ఆర్‌బీఎస్‌కే వైద్యులు డా. శ్రీకాంత్, డా. శిరీష, హెల్త్ సూపర్వైజర్ ఎం. ఇస్మాయిల్ బేగ్ పాల్గొన్నారు.

వైద్యాధికారి డా. ఆల్తాఫ్ మాట్లాడుతూ, నులిపురుగుల నివారణ మాత్రలు తీసుకోవడం వల్ల పిల్లల్లో పోషకాహార శోషణ మెరుగుపడి శారీరక, మానసిక ఎదుగుదలకు తోడ్పడుతుందని తెలిపారు. ప్రతి అర్హత కలిగిన 1--19 సంవత్సరాల వయస్సు గల పిల్లలు తప్పనిసరిగా డీ-వార్మింగ్ మాత్రను తీసుకోవాలని సూచించారు.

అదేవిధంగా వ్యక్తిగత పరిశుభ్రత పాటించడం, భోజనానికి ముందు మరియు మరుగుదొడ్డి ఉపయోగించిన తర్వాత సబ్బుతో చేతులు శుభ్రంగా కడుక్కోవడం, పరిశుభ్రమైన ఆహారం తీసుకోవడం వంటి ఆరోగ్యకరమైన అలవాట్లపై అవగాహన కల్పించారు.

ఈ కార్యక్రమంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు, సిబ్బంది, ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

# మాదకద్రవ్యాలకు దూరంగా ఉండండి.. ఆరోగ్యవంతమైన భవిష్యత్తుకు అదే మార్గం: డీసీఆర్బీ డీఎస్పీ బాలాజీ నాయక్



**సీకే న్యూస్ ప్రతినిధి, వనపర్తి జిల్లా**

వనపర్తి జిల్లా ఎస్పీ సునితా రెడ్డి, ఐపీఎస్ ఆదేశాల మేరకు అంతర్జాతీయ మాదకద్రవ్యాల వ్యతిరేక దినోత్సవాన్ని పురస్కరించుకుని సోమవారం వనపర్తి ప్రభుత్వ నర్సింగ్ కళాశాలలో మాదకద్రవ్యాల నిర్మూలన, విద్యార్థినుల భద్రత, మహిళల రక్షణపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు.

కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన డీసీఆర్బీ డీఎస్పీ బాలాజీ నాయక్ మాట్లాడుతూ, మాదకద్రవ్యాలు యువత భవిష్యత్తును నాశనం చేసే సామాజిక దురాచారమని అన్నారు. ప్రతి విద్యార్థి వ్యసనాలకు దూరంగా ఉండి లక్ష్య సాధనపై దృష్టి పెట్టాలని సూచించారు. "యాంటీ డ్రగ్ సోల్జర్" సర్టిఫికెట్ సమాజంలో మాదకద్రవ్యాలపై అవగాహన కల్పించే బాధ్యతకు ప్రతీక అని పేర్కొన్నారు.

అంతర్జాతీయ మాదకద్రవ్యాల వ్యతిరేక దినోత్సవం సందర్భంగా నిర్వహించిన వివిధ పోటీల్లో ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు ప్రశంసా పత్రాలు, పతకాలు, "యాంటీ డ్రగ్ సోల్జర్" సర్టిఫికెట్లను డీఎస్పీ బాలాజీ నాయక్, ఎస్సై అంజాద్, కళాశాల ప్రిన్సిపాల్ నవీన, వైస్ ప్రిన్సిపాల్ సంయుక్తంగా అందజేశారు.

విద్యార్థినుల భద్రతపై అవగాహన కల్పిస్తూ ర్యాగింగ్, ఈవ్‌టీజింగ్, సైబర్ వేధింపులు వంటి ఘటనలు ఎదురైతే వెంటనే పోలీసులను సంప్రదించాలని, ప్రభుత్వం అందుబాటులో ఉంచిన 1908 టోల్‌ఫ్రీ సేవలను వినియోగించుకోవాలని సూచించారు. మహిళల భద్రత, యువత సంక్షేమం, మాదకద్రవ్యాల నిర్మూలన కోసం పోలీసు శాఖ నిరంతరం చర్యలు చేపడుతోందన్నారు.

ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ నవీన, వైస్ ప్రిన్సిపాల్, అధ్యాపకులు, పోలీసు అధికారులు, సిబ్బంది, సుమారు 400 మంది విద్యార్థులు పాల్గొన్నారు.

# మహబూబ్ నగర్,రంగారెడ్డి, హైదరాబాద్ జిల్లాల చెందిన ఉద్యమకారులతో కేకే కమిటీ సమావేశం

- పాల్గొన్న తెలంగాణ ఉద్యమకారుల సంక్షేమ సంఘం రంగారెడ్డి జిల్లా అధ్యక్షులు టీజీ శ్రీనివాస్, షాద్నగర్ మాజీ అధ్యక్షుడు వెంకట్రాంరెడ్డి



**సి కే న్యూస్ షాద్ నగర్ :జులై 13:** మహబూబ్ నగర్,రంగారెడ్డి, హైదరాబాద్ జిల్లాల చెందిన ఉద్యమకారులతో కేకే కమిటీ సమావేశం జరిగినది. ఈ కమిటీ సమావేశంలో షాద్ నగర్ నుండి వెంకట్రాంరెడ్డి తెలంగాణ ఉద్యమకారుల సంక్షేమ సంఘం రంగారెడ్డి జిల్లా అధ్యక్షులు, టీజీ శ్రీనివాస్ తెలంగాణ ఉద్యమకారుల జేఏసీ షాద్ నగర్ ప్రెసిడెంట్ పాల్గొన్నారు. వెంకట్రాంరెడ్డి మాట్లాడుతూ తెలంగాణ ఉద్యమంలో పాల్గొన్న ప్రతి ఒక్కరికి అధికారిక గుర్తింపు కార్డు, హెల్త్ ఇన్సూరెన్స్ కార్డు ఉద్యమకారుల అందరికీ 250గజాల ఇంటి స్థలాలు గ్రామీణ ప్రాంతంలో ఒకే దగ్గర ఉద్యమ కారుల కాలనీగా గుర్తించి అక్కడ ఇంటి స్థలాలను కేటాయించాలని కమిటీకి విజ్ఞప్తి చేశారు. టి జి శ్రీనివాస్ మాట్లాడుతూ కేకే కమిటీ ఉమ్మడి పది జిల్లాల పర్యటించి కుల సంఘాలతో కూడా మాట్లాడాలని కోరారు, నిజమైన ఉద్యమకారులను ఆనాటి జేఏసీ మరియు మీడియా ద్వారా గుర్తించాలని సూచించారు. తెలంగాణ సిద్ధాంతకర్త ప్రొఫెసర్ జయశంకర్ సార్ తెలంగాణ జాతిపితగా రాష్ట్ర ప్రభుత్వం చట్టపరంగా ప్రకటించాలని కేకే కమిటీ ద్వారా ప్రభుత్వానికి విన్నవించాలని కమిటీకి విజ్ఞప్తి చేసినారు. ఈ కార్యక్రమంలో శ్రీనివాసులు రెడ్డి రవికుమార్ గౌడ్ మేకల వెంకటేష్ ముదిరాజ్ మొదలగును వారు పాల్గొన్నారు.

# జల్పల్లి మున్సిపాలిటీలో పాదయాత్ర చేస్తా..

- మైనారిటీల సమస్యల పరిష్కారానికి అండగా నిలుస్తా: ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న
- ఎంఐఎం మైనారిటీలను కేవలం ఓటు బ్యాంకుగానే చూసింది: జల్పల్లి మైనారిటీ ప్రతినిధుల ఆవేదన
- తెలంగాణ రాజ్యాధికార పార్టీ ప్రభుత్వంలో తొలి ముస్లిం మహిళను అసెంబ్లీకి పంపిస్తాం: మల్లన్న హామీ



**సి కె న్యూస్ ప్రతినిది:** మహేశ్వరం నియోజకవర్గం నుంచి 'సర్జికల్ స్ట్రైక్--59' ఉద్యమాన్ని విస్తరించాలని విజ్ఞప్తి

జల్పల్లి మున్సిపాలిటీకి చెందిన మైనారిటీ ప్రతినిధులు తెలంగాణ రాజ్యాధికార పార్టీ అధినేత, ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్నను పార్టీ కేంద్ర కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిసి తమ సమస్యలను వివరించారు. ఈ సమావేశం సామాజిక తెలంగాణ ఇంటలెక్చువల్ ఫోరం జనరల్ సెక్రటరీ దేవల్ల సమ్మయ్య, బీసీ ఎంప్లాయిస్ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షులు సతీష్ కొట్టే, తెలంగాణ రాజ్యాధికార పార్టీ రాష్ట్ర మహిళా విభాగం అధ్యక్షురాలు పటేల్ వనజ ఆధ్వర్యంలో జరిగింది.

ఈ సందర్భంగా జల్పల్లి మున్సిపాలిటీ మైనారిటీ ప్రతినిధులు మాట్లాడుతూ, గత 25 ఏళ్లుగా ఎంఐఎం పార్టీ అధికారంలో ఉన్న ఏ ప్రభుత్వానికైనా అనుకూలంగా వ్యవహరిస్తూ, జల్పల్లి మున్సిపాలిటీలోని మైనారిటీల సమస్యలను పూర్తిగా విస్మరించిందని ఆరోపించారు. తమను కేవలం ఓటు బ్యాంకుగా మాత్రమే ఉపయోగించుకుని, అభివృద్ధికి దూరం చేసిందని ఆవేదన వ్యక్తం చేశారు.

మున్సిపాలిటీ అభివృద్ధిని కావాలనే అడ్డుకుంటూ, మైనారిటీల సంక్షేమాన్ని నిర్లక్ష్యం చేయడం ఎంఐఎం విధానంగా మారిందని పేర్కొన్నారు. అందుకే ప్రజల కోసం పోరాడుతున్న తీన్మార్ మల్లన్న నాయకత్వంలోని తెలంగాణ రాజ్యాధికార పార్టీ వైపు తాము ఆకర్షితులవుతున్నామని తెలిపారు. మల్లన్న తమకు అండగా ఉంటే ప్రజా సమస్యల పరిష్కారం కోసం ఎంతటి పోరాటానికైనా సిద్ధంగా ఉంటామని స్పష్టం చేశారు.

జల్పల్లి మున్సిపాలిటీలో స్వయంగా పాదయాత్ర నిర్వహించి ప్రజల సమస్యలను ప్రత్యక్షంగా తెలుసుకోవాలని మల్లన్నను కోరారు. అలాగే భువనగిరి "రాజ్యాధికార సమరభేరి" సభలో ప్రారంభించిన 'సర్జికల్ స్ట్రైక్--59' ఉద్యమాన్ని మహేశ్వరం నియోజకవర్గంలోనూ ప్రారంభించాలని విజ్ఞప్తి చేశారు.

ఈ సందర్భంగా ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న మాట్లాడుతూ, 1951 నుంచి ఇప్పటి వరకు ఒక్క ముస్లిం మహిళ కూడా అసెంబ్లీలో అడుగుపెట్టలేదని, ఈ చారిత్రక లోటును తెలంగాణ రాజ్యాధికార పార్టీ భర్తీ చేస్తుందని తెలిపారు. తమ పార్టీ ప్రభుత్వం ఏర్పడితే తొలి ముస్లిం మహిళకు అసెంబ్లీలో ప్రాతినిధ్యం కల్పిస్తామని హామీ ఇచ్చారు.

జల్పల్లి మున్సిపాలిటీలో త్వరలోనే పాదయాత్ర నిర్వహించి ప్రతి కాలనీ, ప్రతి వాడలో ప్రజల సమస్యలను స్వయంగా తెలుసుకుంటానని తెలిపారు. క్షేత్రస్థాయిలో సమస్యలను అధ్యయనం చేసి, రాబోయే ప్రభుత్వంలో శాశ్వత పరిష్కారం దిశగా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

ప్రజల సమస్యలను ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లడంలో ఎప్పుడూ ముందుంటానని, అన్యాయంపై పోరాటంలో మొదటి దెబ్బ తనకే తగిలినా వెనక్కి తగ్గేది లేదని మల్లన్న స్పష్టం చేశారు. మైనారిటీల హక్కుల సాధన కోసం తెలంగాణ రాజ్యాధికార పార్టీ నిరంతరం పోరాడుతుందని పేర్కొన్నారు.

సమావేశం అనంతరం జల్పల్లి మైనారిటీ ప్రతినిధులు మల్లన్నకు తమ పూర్తి మద్దతు ప్రకటిస్తూ, త్వరలోనే భారీ సమావేశం నిర్వహించి భవిష్యత్ కార్యాచరణను ప్రకటిస్తామని తెలిపారు. తమ సమస్యలను ఆత్మీయంగా విని, అండగా నిలుస్తానని హామీ ఇచ్చిన తీన్మార్ మల్లన్నకు వారు కృతజ్ఞతలు తెలిపారు.

ఈ కార్యక్రమంలో జల్పల్లి మున్సిపాలిటీకి చెందిన మహమ్మద్ ఘౌస్,మొహమ్మద్ మజ్హర్ అలీ,షకీర్ భాయ్,హమద్ భాయ్,మొహమ్మద్ షాహిద్,మొహమ్మద్ సాజిద్,అబ్దుల్ ఖయ్యూం,మొహమ్మద్ రఫీక్,మొహమ్మద్ హాజీ,మొహమ్మద్ ముస్తఫా ఖాన్,అఫ్సర్,ఖాజా పాషా,నియాజ్,హసన్ అలీ,ఖాజా భాయ్,వహీద్ భాయ్,నసీమ్ భాయ్ ,పర్వీజ్ భాయ్ తదితరులు పాల్గొన్నారు

# రాజ్యాంగంపై అవగాహన సదస్సుకు ఆహ్వాన పత్ర



**సి కె న్యూస్ మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా స్టాఫ్ రిపోర్టర్**

సోమవారం రోజున భారత రాజ్యాంగ హక్కుల పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో డాక్టర్ శ్రీ కాసిం ఉస్మానియా యూనివర్సిటీ ప్రొఫెసర్ గారికి ఆహ్వాన పత్రం అందించడం జరిగింది జూలై 19 ఆదివారం 11:30 కు జరగబోయే భారత రాజ్యాంగం పై అవగాహన సదస్సుకు డాక్టర్ శ్రీ కాసిం గారికి ఆహ్వాన పత్రం అందజేయడం జరిగింది భారత రాజ్యాంగంలోని హక్కులను నెరవేర్చేందుకు అంబేద్కర్ జీవిత చరిత్ర ఆయన కృషిని భారత రాజ్యాంగాన్ని పాఠ్యపుస్తకంలో చేర్చాలని డిమాండ్. ప్రతి ఇంట్లో భారత రాజ్యాంగం అనే గ్రంథం ఉండేలా. ఉచిత విద్య ఉచిత వైద్యం ఉపాధి అవకాశాలు.మరియు ప్రైవేటు విద్యా వైద్య ఉద్యోగ రంగాలలో రిజర్వేషన్ల అమలుకై కృషి చేయాలి. క్రిమిలేయను వర్తింపజేయాలి ప్రతి జిల్లా కలెక్టర్ ఆఫీస్ ముందు ప్రతి మండల ఆఫీసు ముందు అంబేద్కర్ విగ్రహాలు పెట్టాలని. డిమాండ్ చేస్తూ డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ ఆలోచన విధానాన్ని వర్ధిల్లాలి జ్యోతిరావు పూలే స్ఫూర్తితో ముందుకు వెళ్దాం. ఎస్సీ ఎస్టీ బీసీ మైనారిటీ వికలాంగుల ఓబిసి విద్యార్థుల ఐక్యతను వర్ధిల్లాలి, ఆత్మగౌరం సామాజిక న్యాయం రాజ్యాధికార పోరాటాలు వర్ధిల్లాలి కుల నిర్మూలన కోసం పోరాడుదాం దళిత బహుజన కార్మిక కర్షక శ్రామిక విద్యార్థి యువజన మహిళా ఉద్యోగ మేధావులు ఐక్యతలు వర్ధిల్లాలి వివక్షత లేని రాజ్యాన్ని స్థాపితం సామాజిక న్యాయాన్ని స్థాపించుకుందాం అని భారత రాజ్యాంగ హక్కుల నిర్వాహకులు మహంకాళి భిక్షు కోరినారు ఈ కార్యక్రమంలో సంఘం కృష్ణ దుబ్బ గుడిసెల మల్లేష్ తదితరులు పాల్గొన్నారు

# బాస్వపురం గ్రామం అంగన్వాడి స్కూల్ నందు విద్యార్థులకు నులిపురుగులు నివరణ మాత్రలు పంపిణీ చేసిన సర్పంచ్ ఆవుల నరసింహారావు

**సి కే న్యూస్ చింతకాని ప్రతినిధి.** మండల పరిధి భస్వపుర గ్రామంలో ప్రాథమిక పాఠశాల మరియు అంగన్వాడి స్కూలు యందు విద్యార్థులకు నులిపురుగుల నివారణ మాత్రల పంపిణీ కార్యక్రమంను ప్రారంభించిన గ్రామ సర్పంచ్ ఆవులు నరసింహారావు

ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ ప్రాధనోపాధ్యాయులు, ఆశ మరియు అంగన్వాడీ సిబ్బంది తదితరులు పాలొగొన్నారు



# గద్వాల నియోజకవర్గం అభివృద్ధికి తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం కృషి...

- సంక్షేమం, అభివృద్ధి ధ్యేయంగా ప్రజా ప్రభుత్వ పాలన.
- రహదారుల నిర్మాణానికి పెద్ద ఎత్తున నిధుల మంజూరు.
- ప్రాజెక్టులు పూర్తయితే పూర్తి స్థాయిలో ఆయకట్టుకు సాగునీరు.
- జోగులాంబ గద్వాల జిల్లాకు 339.39 కోట్లతో రహదారులకు గద్వాల నిర్మాణానికి శంకుస్థాపన చేసి భూమి పూజ చేసిన రాష్ట్ర మంత్రివర్యులు గారు, ఎమ్మెల్యే గారు జిల్లా కలెక్టర్ గారు..
- గద్వాల నియోజకవర్గంలో రోడ్డు అభివృద్ధికి 162 కోట్ల వ్యయంతో నిధులు కేటాయించారు ..



**సి కె న్యూస్ ప్రతినిధి గద్వాల**

ఈరోజు గద్వాల నియోజకవర్గంలోని ధరూర్ మండల కేంద్రంలో రహదారులు విస్తరణ, మరమ్మత్తుల నిర్మాణానికి రూ.339.39 కోట్ల నిధులతో చేపట్టిన భూమి పూజ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా రాష్ట్ర రోడ్డుడ భవనాలు మంత్రివర్యులు కోమటిరెడ్డి వెంకటరెడ్డి గారు, జిల్లా మంత్రివర్యులు జూపల్లి కృష్ణారావు గారు ఎమ్మెల్యే శ్రీ బండ్ల కృష్ణమోహన్ రెడ్డి గారు, షాద్ నగర్ ఎమ్మెల్యే కె. శంకరయ్య గారు అల్లంపూర్ ఎమ్మెల్యే విజయుడు గారు జిల్లా కలెక్టర్ రిజ్వాన్ భాషా గారు హాజరయ్యారు..

రాష్ట్ర మంత్రివర్యులు గారికి ధరూర్ మండల నాయకులు గజమాలతో ఘనంగా స్వాగతం పలికారు...

డాక్టర్ స్వర్గీయ వైయస్ రాజశేఖర్ రెడ్డి గారి విగ్రహానికి మంత్రివర్యులు కోమటిరెడ్డి జూపల్లి కృష్ణారావు గారు పూలమాలవేసి నివాళులర్పించారు..

రాష్ట్ర మంత్రివర్యులకు గద్వాల ఎమ్మెల్యే గారు, ప్రజా ప్రతినిధులు నాయకులు పుష్పగుచ్ఛం ఇచ్చి శాలువా కప్పి ఘనంగా స్వాగతం పలికారు..

రాష్ట్ర రోడ్డు భవనాల శాఖ మంత్రివర్యులు గారు మాట్లాడుతూ.....

రాష్ట్రంలో రహదారుల నిర్మాణానికి దేశంలో ఎక్కడా లేనివిధంగా పెద్ద ఎత్తున నిధులను మంజూరు చేయడం జరిగిందన్నారు.

కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాగానే మొదట మహాలక్ష్మి పథకంలో భాగంగా మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం కల్పించడం జరిగిందన్నారు. కొత్త రేషన్ కార్డులు ఇవ్వడమే కాక 3.18 కోట్ల లబ్ధిదారులకు సన్న బియ్యం పంపిణీ చేస్తున్నమన్నారు.

గృహ జ్యోతి పథకంతో నెలకు అర్హులైన ప్రతి కుటుంబానికి 200 యూనిట్ల ఉచిత విద్యుత్ ను అందించడం జరుగుతోందన్నారు. కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేయడమే లక్ష్యంగా వారికి పెద్ద ఎత్తున వడ్డీ లేని రుణాలను అందిస్తున్నామన్నారు. మహిళలకు పెట్రోల్ బంకుల నిర్వహణ, బస్సులను కొనుగోలు చేసి ఆర్టీసీకి అద్దెకు ఇవ్వడం ద్వారా ఆర్థికంగా ఎదిగేందుకు సహకరిస్తున్నామన్నారు.

గద్వాల నియోజకవర్గంలో 3500 ఇందిరమ్మ ఇల్లు నిర్మాణం కావడం జరుగుతుంది. అర్హులైన ప్రతి ఒక్కరికి సంక్షేమ పథకాలను అందించడం జరుగుతుంది. అరులైన పేదవారికి ఇందిరమ్మ ఇల్లును ఐదు లక్షల రూపాయలను ప్రభుత్వము అందజేయడం జరుగుతుందని తెలిపారు.

ఎమ్మెల్యే గారు కోరినటువంటి మరికొన్ని రోడ్లను త్వరలోనే మంజూరు చేయించి గద్వాల నియోజకవర్గంలో రోడ్డు సమస్యలు లేకుండా చూసే విధంగా ప్రజాపాలన రేవంత్ రెడ్డి ప్రభుత్వంలో కృషి చేస్తామని తెలిపారు.

ఇందిరమ్మ చీరలను పంపిణీ చేయడంతో మహిళా సంఘాలకు ప్రత్యేక గుర్తింపు వచ్చిందన్నారు..

ఎక్సైజ్, పర్యాటక, సాంస్కృతిక, పురావస్తు శాఖల మంత్రివర్యులు గారు మాట్లాడుతూ...

రాష్ట్రవ్యాప్తంగా ఆర్ అండ్ బి, పంచాయతీరాజ్ రహదారుల నిర్మాణానికి ప్రభుత్వం రూ. 25 వేల కోట్లకు పైగా నిధులను మంజూరు చేయడం గర్వకారణమన్నారు.

గుడ్డెం దొడ్డి రిజర్వాయర్ 1.5 సామర్థ్యాన్ని నుండి 15 టీఎంసీలకు పెంచడం ద్వారా కరువు పరిస్థితుల్లోనూ తాగు, సాగునీటికి ఇబ్బంది ఉండదన్నారు.

ఉమ్మడి జిల్లాలో నిర్మాణంలో ఉన్న సాగునీటి ప్రాజెక్టుల నిర్మాణం పూర్తయితే పూర్తి స్థాయిలో ఆయకట్టుకు నీటిని అందించడం జరుగుతుందన్నారు. గట్టు ఎత్తిపోతల పథకాన్ని కూడా ముందుకు తీసుకెళ్లేందుకు కృషి చేస్తున్నామన్నారు.

ప్రతి కుటుంబం తమ పిల్లలను బాగా చదివించి ఉన్నత స్థాయికి చేరుకునేలా కృషి చేయాలని సూచించారు. మహిళా, రైతు, యువజన సంఘాలు అభివృద్ధిలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు.

గద్వాల ఎమ్మెల్యే గారు మాట్లాడుతూ...

జిల్లాలోని రోడ్లకు మహర్దశ తీసుకొచ్చేందుకు ప్రభుత్వం హామ్ రోడ్ల నిర్మాణానికి పెద్ద ఎత్తున నిధులను మంజూరు చేసిందన్నారు. గతంలోనూ మంత్రి జూపల్లి సహకారంతో గద్వాల నియోజకవర్గంలో పంచాయతీరాజ్ శాఖ రహదారుల నిర్మాణానికి రూ .40 కోట్ల నిధులను మంజూరు చేశారని గుర్తు చేశారు.

గద్వాల్ నియోజకవర్గంలోని నిరుద్యోగ యువతకు వివిధ అంశాల్లో శిక్షణ ఇచ్చేందుకు జిల్లాలో సాంకేతిక శిక్షణ కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని కోరారు.

గద్వాల నియోజకవర్గంలో పూర్తిస్థాయిలో ఆయకట్టుకు సాగునీరు అందించేందుకు ఇటీవల ముఖ్యమంత్రి గుడ్డెందొడ్డి రిజర్వాయర్ ను సందర్శించి దాని సామర్థ్యాన్ని 15 టిఎంసిలకు పెంచేందుకు ప్రతిపాదించడం జరిగిందన్నారు.

అదేవిధంగా గద్వాల నియోజకవర్గంలో మరికొన్ని రోడ్లోనూ నిధులను కేటాయించాలని

గద్వాల్ నుండి అయిజ, గద్వాల నుండి ఉప్పేర్,

గట్టు టు మాచర్ల బలిగర టు మాచర్ల గద్వాల్ టు పూడూర్ కేటాయించాలని కోరారు..

ఈ కార్యక్రమంలో వాల్మీకి బోయ కార్పోరేషన్ చైర్మన్ గట్టు తిమ్మప్ప, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ నీలి శ్రీనివాసులు, ఉమ్మడి జిల్లా డైరెక్టర్ సుభాన్ గద్వాల మార్కెట్ యార్డ్ చైర్మన్ హనుమంతు, మున్సిపల్

చైర్ పర్సన్ తుమ్మల జయలక్ష్మి నరసింహులు యాదవ్, డిసిసి అధ్యక్షుడు రాజీవ్ రెడ్డి, అదనపు కలెక్టర్లు మధుమోహన్, నర్సింగరావు, ఆర్డీవో శ్రీనివాసరావు,,రాజు తిమ్మారెడ్డి, మాజీ జెడ్పీ చైర్మన్ బండారి భాస్కర్, జిల్లా గ్రంథాలయ మాజీ చైర్మన్ జుంబురామన్ గౌడ, జిల్లా సీనియర్ నాయకులు పటేల్ ప్రభాకర్ రెడ్డి, గడ్డం కృష్ణారెడ్డి, బండ్ల చంద్రశేఖర్ రెడ్డి,రమేష్ నాయుడు, మహేశ్వర్ రెడ్డి, సత్య రెడ్డి, రాజశేఖర్ రెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, రమేష్ రెడ్డి, ఎంపీపీ విజయ్ కుమార్, వైస్ ఎంపీపీ సుదర్శన్ రెడ్డి, జిల్లా సర్పంచ్ సంఘ రాజశేఖర్, స్థానిక సర్పంచ్ డి. ఆర్ విజయ్, మార్కెట్ వైస్ చైర్మన్ శ్రీకాంత్ రెడ్డి, మున్సిపల్ వైస్ చైర్మన్ శంకర్, కౌన్సిలర్స్, వివిధ గ్రామాల సర్పంచులు, జిల్లా సీనియర్, నాయకులు కార్యకర్తలు యూత్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# స్థలాల గురించి కలెక్టర్ వినతి పత్రం



**సీకే న్యూస్ కొల్చారం నర్సాపూర్:** మెదక్ జిల్లా కొల్చారం మండలం అప్పాజీపల్లి గ్రామంలో సర్పంచ్ వెంకట్ గౌడ్ ప్రజావాణి సందర్భంగా అప్పాజీపల్లి గ్రామానికి సంబంధించి డంప్ యార్డ్ గురించి స్థలం కేటాయించాలని జాయింట్ కలెక్టర్ నగేష్ సార్ కి వినతిపత్రం ఇవ్వడం జరిగింది

ఈ కార్యక్రమం లో సర్పంచ్ నాయిని వెంకట్ గౌడ్ ఉపసర్పంచ్ చలం నర్సింలు వార్డ్ మెంబెర్స్ సదాల నర్సింలు, కన్నీబోయిన రామాంజం, మానేపల్లి సావిత్రి, కదూరి సుశీల పాల్గొన్నారు

# ప్రజా సమస్యల త్వరితగతిన పరిష్కారమే కూటమి ప్రభుత్వ ధ్యేయం.

- రాష్ట్ర హోం మంత్రి వంగలపూడి అనిత.
- బాధితుల సమస్యల పై అక్కడికక్కడే అధికారులకు ఆదేశాలు జారీ చేసిన హోం మంత్రి, జిల్లా ఎస్పీ.
- పోలీసు ఉన్నతాధికారులతో విస్తృత స్థాయి 'క్రైమ్ రివ్యూ' నిర్వహించిన మంత్రి.

**అనకాపల్లి, సి కె న్యూస్ ప్రతినిధి జూలై 13:** జిల్లాలోని సామాన్య ప్రజలు, మహిళలు, బాధితుల సమస్యలను త్వరితగతిన, పారదర్శకంగా పరిష్కరించడమే లక్ష్యంగా సోమవారం జిల్లా పోలీసు కార్యాలయంలో ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమం అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్వహించబడింది.

ఈ కార్యక్రమానికి రాష్ట్ర హోం, విపత్తు నిర్వహణ శాఖ మంత్రి వంగలపూడి అనిత ముఖ్య అతిథిగా విచ్చేశారు.

జిల్లా ఎస్పీ తుహిన్ సిన్హా తో కలిసి హోం మంత్రి సోమవారం ఈ కార్యక్రమంలో పాల్గొని, జిల్లా నలుమూలల నుండి వచ్చిన బాధితుల నుంచి నేరుగా అర్జీలను స్వీకరించారు. ప్రతి ఒక్కరి సమస్యను ఎంతో ఓపికగా, స్వయంగా అడిగి తెలుసుకున్న మంత్రి, అక్కడి కక్కడే చట్టపర మైన పరిష్కారం చూపాలంటూ సంబంధిత పోలీసు అధికారులకు స్పష్ట మైన ఆదేశాలు జారీ చేశారు. హోం మంత్రి మాట్లాడుతూ

ప్రజల చెంతకే పాలనను అందించడం, శాంతి భద్రతలను కాపాడటమే మా కూటమి ప్రభుత్వ ప్రథమ ప్రాధాన్యత. గతంలో ప్రజలు తమ సమస్యలను చెప్పు కోవడానికి కూడా భయపడే పరిస్థితి ఉండేది. కానీ నేడు, సామాన్య పౌరుడికి, ముఖ్యంగా మహిళలకు పూర్తి భరోసా కల్పించేలా పోలీసు యంత్రాంగం పనిచేస్తోంది. అనకాపల్లి జిల్లాలో ఎస్పీ తుహిన్ సిన్హా నేతృత్వంలో పోలీసులు ప్రజలకు ఎంతో జవాబుదారీగా ఉంటూ, ఫ్రెండ్లీ పోలీసింగ్‌ను నిజం చేస్తున్నారు. ఈ రోజు పిజిఆర్ఎస్ కి వచ్చిన ప్రతి అర్జీని నేను, ఎస్పీ స్వయంగా పరిశీలించాము. సివిల్ వివాదాలు, కుటుంబ గొడవలు, సైబర్, ఆర్థిక మోసాల బారిన పడిన బాధితులకు తక్షణ న్యాయం చేయాలని అధికారులను ఆదేశించాను. ప్రజలు ఎవరూ అధైర్యపడొద్దు, మీ వెనుక ప్రభుత్వం, చట్టాన్ని రక్షించే పోలీస్ శాఖ ఎల్లప్పుడూ అండగా ఉంటాయి అన్నారు. జిల్లా ఎస్పీ తుహిన్ సిన్హా మాట్లాడుతూ హోం మంత్రి స్వయంగా మన జిల్లా పోలీసు కార్యాలయానికి విచ్చేసి, బాధితుల నుంచి ఫిర్యాదులు స్వీకరించడం మా పోలీసు యంత్రాంగానికి ఎంతో ఉత్సాహాన్ని, బాధ్యతను పెంచింది. అనకాపల్లి జిల్లా వ్యాప్తంగా శాంతి భద్రతల పరి రక్షణకు, మహిళల భద్రతకు మేము అత్యంత ప్రాధాన్యత ఇస్తున్నాము. మంత్రి ఆదేశాల మేరకు.. ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పిజిఆర్ఎస్) లో వచ్చిన ప్రతి ఫిర్యాదు పై తక్షణమే విచారణ జరిపి, నిర్ణీత సమయం లోగా బాధితులకు పూర్తి న్యాయం జరిగేలా చూస్తాం. చట్టాన్ని ఉల్లంఘించే వారి పై, ముఖ్యంగా మహిళల పై అరాచకాలకు పాల్పడే వారి పై ఉక్కుపాదం మోపుతాం.

అధికారులతో క్రైమ్ రివ్యూ (నేర సమీక్షా సమావేశం) -- కీలక గణాంకాలు, ఫిర్యాదుల స్వీకరణ అనంతరం, హోం మంత్రి జిల్లా పోలీస్ ఉన్నతాధికారులతో ప్రత్యేకంగా 'క్రైమ్ రివ్యూ' నిర్వహించారు. జిల్లాలో నమోదవుతున్న నేరాల శాతం, కేసుల పురోగతి, గంజాయి నిర్మూలనకు తీసుకుంటున్న చర్యలను జిల్లా ఎస్పీ తుహిన్ సిన్హా పవర్ పాయింట్ ప్రెజెంటేషన్ ద్వారా వివరించారు. 1. జిల్లాలో తగ్గిన నేరాల శాతం: గత ఏడాదితో పోలిస్తే జిల్లాలో పలు విభాగాల్లో నేరాలు గణనీయంగా తగ్గాయి. 2, మహిళలపై నేరాలు: గత ఏడాది 606 కేసులు నమోదు కాగా, ఈ ఏడాది అది 567 కి తగ్గి, -7.00% తగ్గుదల నమోదైంది. 3, గంజాయి, ఎన్డిపిఎస్ కేసులు: గత ఏడాది 180 కేసులు నమోదు కాగా, ఈ ఏడాది 111 కేసులతో -38.33% భారీ తగ్గుదల నమోదైంది. 4, మొత్తం దర్యాప్తులో ఉన్న కేసులు: గత ఏడాది 3,914 నుండి ఈ ఏడాది 2,802 కి తగ్గి, 28.41% క్రైమ్ రేటు తగ్గింది. 5, సైబర్ నేరాలు, సోషల్ మీడియా: సైబర్ నేరాలు 26.8%, సోషల్ మీడియా అపరాధాలు 65% పెరిగినట్లు నివేదికలు స్పష్టం చేస్తున్నాయి. దీని పై ప్రత్యేక నిఘా పెట్టాలని హోంమంత్రి ఆదేశించారు.

# అమలుకు నోచుకోని జర్నలిస్టుల సంక్షేమ హామీలు

- నిరసనగా టిడబ్ల్యూజేఫ్ ఆధ్వర్యంలో మేడ్చల్ కలెక్టరేట్ ముందు ధర్నా




**సీకే న్యూస్ మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా స్టాఫ్ రిపోర్టర్ రంజిత్ :**తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం జర్నలిస్టులకు ఇచ్చిన హామీలను నిర్దిష్టంగా అమలుచేయాలని మీడియా స్వేచ్ఛ కాపాడాలని తెలంగాణ వర్కింగ్ జర్నలిస్టు ఫెడరేషన్ ( టీడబ్ల్యూజేఎఫ్) నాయకులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం రాష్ట్ర వ్యాపిత పిలుపులో బాగంగా మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కలెక్టరేట్ ముందు నిరసన కార్యక్రమం నిర్వహించారు. జర్నలిస్టుల సమస్యలు పరిష్కరించాలని భారీగా నినాదాలు చేస్తూ ధర్నా చేశారు. ఈ సందర్భంగా రాష్ట్ర నాయకులు ఎస్ కె సలీమా, గుమ్మడి ప్రసాద్,జిల్లా అధ్యక్షుడు మల్లేష్ గౌడ్, కార్యదర్శి బనావత్ రవి నాయక్,మేడ్చల్ నియోజకవర్గం కన్వీనర్ అంబాల విష్ణు,జర్నలిస్టులు ఎదుర్కొంటున్న సమస్యలను వివరించారు.అర్హులైన వారందరికీ వెంటనే అక్రిడేషన్ ఇవ్వాలని,హెల్త్ కార్డులు, పిల్లలకు స్కూల్ ఫీజుల్లో రాయతీలు ఇండ్ల స్థలాల హామీలు అమలు విషయంలో ప్రభుత్వ నిర్లక్ష్యంగా వ్యవరిస్తుందని అన్నారు. ఇచ్చిన హామీలు వెంటనే అమలు చేయాలని లేందంటే ఆందోళన తీవ్రతరం చేస్తామని ప్రభుత్వాన్ని ఈ సందర్భంగా హెచ్చరించారు.అనంతరం కలెక్టర్ కు వినతి పత్రం సమర్పించారు.ఈకార్యక్రమంలో ఫెడరేషన్ జిల్లా,నియోజక వర్గం ఇంచార్జ్ లు నాయకులు పెద్ద సంఖ్యలో జర్నలిస్టులు పాల్గొన్నారు.

# ఘనంగా ఎమ్మెల్యే సతీమణి శ్రీమతి బండ్ల జ్యోతి గారు జన్మదిన వేడుకలు



**సి కె న్యూస్ ప్రతినిధి గద్వాల :**ఈరోజు గద్వాల జిల్లా కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో నందు గద్వాల ఎమ్మెల్యే శ్రీ బండ్ల కృష్ణమోహన్ రెడ్డి గారి సమాక్షంలో ఎమ్మెల్యే సతీమణి శ్రీమతి డశ్రీ బండ్ల జ్యోతి కృష్ణమోహన్ రెడ్డి గారి జన్మదిన సందర్భంగా యవ నాయకులు అజయ్ ఆధ్వర్యంలో కేక్ కటింగ్ చేసి జన్మదిన శుభాకాంక్షలు తెలిపిన శాలువా కప్పి పుష్పగుచ్ఛం ఇచ్చి ఘనంగా గజమాల తో ఘనంగా సత్కరించారు ....

ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, మాజీ ప్రజాప్రతినిధులు , సీనియర్ నాయకులు కార్యకర్తలు యూత్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# జాతీయ నులి పురుగుల నిర్మూలన దినోత్సవం సందర్భంగా అవగాహన కార్యక్రమం



**సీకే న్యూస్ కొల్చారం నర్సాపూర్:** మెదక్ జిల్లా కౌడిపల్లి మండలంలోని బుజారంపేట్ గ్రామంలో జాతీయ నులి పురుగుల నిర్మూలన దినోత్సవం సందర్భంగా జూలై 13 నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా బుజారంపేట్ ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు నులి పురుగుల నివారణపై విస్తృత అవగాహన కల్పించి, ఆల్బెండాజోల్ మాత్రలను పంపిణీ చేశారు.

ఈ సందర్భంగా డాక్టర్ రవళి మాట్లాడుతూ, చిన్నారుల్లో నులి పురుగుల సమస్యను నివారించేందుకు ప్రభుత్వం ప్రతి సంవత్సరం జాతీయ నులి పురుగుల నిర్మూలన కార్యక్రమాన్ని నిర్వహిస్తోందన్నారు. నులి పురుగుల వల్ల పిల్లల్లో రక్తహీనత, పోషకాహార లోపం, బలహీనత, కడుపు సంబంధిత వ్యాధులు, శారీరక--మానసిక ఎదుగుదల మందగించడం వంటి సమస్యలు తలెత్తే అవకాశముందని తెలిపారు.

నులి పురుగుల నిర్మూలన ద్వారా రక్తహీనత ప్రమాదం తగ్గుతుందని, పోషకాహార లోపం నివారించబడుతుందని, పిల్లల శారీరక, మానసిక ఎదుగుదల మెరుగుపడుతుందని, ఆకలి, జీర్ణక్రియ మెరుగవుతాయని, పాఠశాలలో విద్యార్థుల ఏకాగ్రత, జ్ఞాపకశక్తి, విద్యా పనితీరు పెరుగుతాయని వివరించారు. ప్రతి అర్హత కలిగిన చిన్నారికి ఆల్బెండాజోల్ మాత్రలు తప్పనిసరిగా ఇవ్వాలని సూచించారు.

అలాగే, 1--2 సంవత్సరాల పిల్లలకు సగం మాత్రను క్రష్ చేసి, 2--3 సంవత్సరాల పిల్లలకు ఒక మాత్రను క్రష్ చేసి, 3--19 సంవత్సరాల పిల్లలకు ఒక మాత్రను నమిలి లేదా చప్పరించి మింగేలా ఇవ్వాలని తెలిపారు. వ్యక్తిగత పరిశుభ్రత పాటించడం, భోజనానికి ముందు మరియు మరుగుదొడ్డి ఉపయోగించిన తర్వాత చేతులను సబ్బుతో శుభ్రంగా కడుక్కోవడం, గోళ్లను చిన్నగా ఉంచుకోవడం, చెప్పులు ధరించడం, పరిశుభ్రమైన ఆహారం, తాగునీరు తీసుకోవడం ద్వారా నులి పురుగుల బారిన పడకుండా ఉండవచ్చని సూచించారు.

ఈ కార్యక్రమంలో డాక్టర్ రవళి, ఏఎన్ఎం సాయమ్మ, సర్పంచ్ పట్లోళ్ల శ్రీనివాస్, ఉపసర్పంచ్ కౌడిపల్లి గోపాల్, పంచాయతీ కార్యదర్శి రత్నం, ఆశా కార్యకర్తలు, అంగన్‌వాడీ టీచర్లు, ఉపాధ్యాయులు, గ్రామ పెద్దలు, విద్యార్థులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.




# "రామాయణంలో మరో అస్త్రం"

భారతీయ సినీ చరిత్రలోనే అతిపెద్ద ప్రాజెక్టుగా రూపొందుతున్న నితేష్ తివారీ 'రామాయణ'పై రోజుకో కొత్త అప్‌డేట్ వినిపిస్తోంది. రణబీర్ కపూర్ రాముడిగా, సాయిపల్లవి సీతగా, కేజీఎఫ్ స్టార్ యశ్ రావణుడిగా నటిస్తున్న చిత్రంలో కాజల్ అగర్వాల్ మండోదరిగా కనిపించనుంది. తాజా టాక్ ప్రకారం.. సినిమాలో విశ్వామిత్ర పాత్ర కీలకం కానుందని, ఆ పాత్రలో సీనియర్ సౌత్ హీరో కనిపించనున్నారని ఇండస్ట్రీ వర్గాల్లో జోరుగా చర్చ నడుస్తోంది. ఆ పాత్రధారి ఎవరన్నదానిపై అధికారిక ప్రకటన రావాల్సి ఉంది.

ఇప్పటికే ఈ చిత్రంలో సన్నీ డియోల్ హనుమంతుడిగా, రవి దూబే లక్ష్మణుడిగా, 1987 సీరియల్‌లో రాముడిగా అలరించిన అరుణ్ గోవిల్ ఈసారి దశరథుడిగా నటిస్తుండటం విశేషం. అమితాబ్ బచ్చన్ జటాయువుకు గాత్రదానం చేయడంతోపాటు చిత్రానికి కథకుడిగానూ వ్యవహరిస్తున్నారు. ఆస్కార్ విజేతలు హాన్స్ జిమ్మర్, ఏఆర్ రెహమాన్ కలిసి సంగీతం అందిస్తుండటం మరో హైలైట్.

రెండు భాగాలుగా రూపొందుతున్న చిత్రంలో తొలి భాగం 2026 దీపావళికి ముందు, రెండో భాగం 2027 అక్టోబర్‌లో విడుదల కానున్నాయి. హాలీవుడ్ ప్రమాణాలతో, విదేశీ సాంకేతిక నిపుణుల భాగస్వామ్యంతో భారీ సెట్స్‌లో చిత్రీకరణ సాగుతోంది. రణబీర్ కెరీర్‌లోనే ఇది అతిపెద్ద ప్రాజెక్ట్ కావడంతో సినీ ప్రపంచం మొత్తం 'రామాయణ'పైనే దృష్టి పెట్టింది.



# జనార్దనుడి చివరి పోరు

విజయ్ దేవరకొండ హీరోగా దర్శకుడు రవికిరణ్ కోలా రూపొందిస్తున్న 'రౌడీ జనార్దన' చిత్రం కీలక ఘట్టానికి చేరుకుంది. ప్రస్తుతం చిత్రబృందం క్లైమాక్స్ షూటింగ్‌కు భారీ సన్నాహాలు చేస్తోంది. ఉత్కంఠభరితమైన యాక్షన్ ఎపిసోడ్స్‌తో సాగనున్న క్లైమాక్స్ కోసం భారీ సెట్స్ నిర్మిస్తున్నట్టు సమాచారం. సినిమా మొత్తానికి విజయ్ యాక్షన్ సన్నివేశాలే ప్రధాన హైలైట్ కానున్నాయని, ఇందులో అతను ఫుల్ యాక్షన్ మోడ్‌లో కనిపించనున్నాడని టాక్. 'రంగస్థలం' తరహా పల్లెటూరి నేటివిటీతో గ్రామీణ నేపథ్యంలో సాగే కథలో విజయ్‌కు జోడీగా కీర్తిసురేశ్ నటిస్తోంది. స్టార్ నిర్మాత దిల్ రాజు నిర్మిస్తున్న చిత్రంలో సీనియర్ హీరో రాజశేఖర్ కీలక పాత్ర పోషిస్తుండటం మరో ఆకర్షణ. రాజశేఖర్ పాత్ర, ఆయన లుక్ మునుపెన్నడూ చూడని రీతిలో ఉంటాయని చిత్రవర్గాలు చెబుతున్నాయి. 'కింగ్‌డమ్' తర్వాత విజయ్‌నుంచి వస్తున్న భారీ చిత్రం కావడం, రచయితగా మంచి పేరున్న రవికిరణ్ కోలా దర్శకత్వం వహిస్తుండటంతో సినిమాపై అంచనాలు ఆకాశాన్ని తాకుతున్నాయి. మరి ఈ 'రౌడీ' ఏ రేంజ్‌లో రచ్చ చేస్తాడో చూడాలి.

# సాహసమే సెంచరీ కొట్టింది

సమంత ప్రధాన పాత్రలో నటించిన 'మా ఇంటి బంగారం' ప్రపంచవ్యాప్తంగా రూ.100 కోట్ల వసూళ్ల మైలురాయిని అందుకుని అరుదైన ఘనత సాధించింది. భారతదేశంలో అత్యధిక వసూళ్లు సాధించిన మహిళా ప్రధాన చిత్రాల జాబితాలో ఆరో స్థానంలో నిలిచిందని సినీవర్గాలు వెల్లడించాయి. నందినీ రెడ్డి దర్శకత్వం వహించిన ఈ చిత్రంలో నటించడమే కాకుండా.. భర్త రాజ్ నిడిమోరు, హిమాంక్ రెడ్డి దువ్వూరుతో కలిసి సమంత దీన్ని నిర్మించడం విశేషం. తెలుగు, తమిళ భాషల్లో ఏకకాలంలో విడుదలైన ఈ హాస్య-యాక్షన్ చిత్రం ప్రేక్షకుల మనసు దోచుకుంది. ఈ సందర్భంగా సమంత పంచుకున్న ఇన్‌స్టా పోస్ట్ ఇండస్ట్రీలో చర్చనీయాంశమైంది. విడుదలకు ముందు తన స్నేహితుడు ఓ ఎగ్జిబిటర్‌తో మాట్లాడగా.. "హీరోయిన్ సినిమాని ఎవరు చూస్తారు? పెద్ద హీరో పక్కన నటిస్తే ఓకే గానీ, నాయికా ప్రధాన చిత్రాన్ని ఎవరు ఆదరిస్తారు?" అన్న సమాధానం వచ్చిందని ఆమె గుర్తు చేసుకున్నారు. "ఎవరైనా సాహసానికి సిద్ధపడినప్పుడే నిజమైన మార్పు వస్తుంది. చాలాసార్లు ఆ సాహసాలు ఫలించవు. కానీ అప్పుడప్పుడు ఫలిస్తాయి. మా విషయంలో ఫలించింది. ఇకపై ఏ ఎగ్జిబిటర్‌నైనా మహిళా ప్రధాన చిత్రం గురించి అడిగితే వెంటనే 'కాదు' అనే సమాధానం రాకూడదన్నదే నా ఆశ" అంటూ ఆమె భావోద్వేగంగా రాసుకొచ్చారు. త్వరలో తల్లి కాబోతున్న సమంతకు ఈ విజయం రెట్టింపు సంతోషాన్ని అందించింది. సినీ ప్రముఖులు, అభిమానుల నుంచి ఆమెకు శుభాకాంక్షలు వెల్లువెత్తుతున్నాయి.





# దైవత్వంపై త్రివిక్రమ్ దృష్టి



స్టార్ డైరెక్టర్ త్రివిక్రమ్ డ్రీమ్ ప్రాజెక్ట్ 'గాడ్ ఆఫ్ వార్'. 'అరవింద సమేత' తర్వాత ఎన్టీఆర్-త్రివిక్రమ్ కాంబినేషన్‌లో వస్తున్న చిత్రం కావడంతో దీనిపై భారీ అంచనాలు నెలకొన్నాయి. అయితే ఈ ప్రాజెక్టుకు అనూహ్యంగా పోటీ ఎదురైంది. ధనుష్-వెట్రిమారన్ కలయికలో 'తమిళ్ మురుగన్' తెరకెక్కుతుండగా.. రెండు చిత్రాలూ సుబ్రహ్మణ్య స్వామి కథ ఆధారంగానే రూపొందుతుండటం విశేషం. పైగా రెండింటి కథాగమనం కూడా దాదాపు ఒకేలా ఉండనుందని టాక్. రాక్షసులపై సుబ్రహ్మణ్య స్వామి సాగించిన యుద్ధాల నేపథ్యంలో పీరియాడిక్ యాక్షన్ డ్రామాగా కథలు తెరకెక్కనున్నాయి. తాజా సమాచారం ప్రకారం 'తమిళ్ మురుగన్' ముందుగా విడుదలయ్యే అవకాశం ఉండటంతో.. త్రివిక్రమ్ తన స్క్రిప్టుపై మరోసారి ఫోకస్ పెట్టారట. కేవలం స్వామి కథను చెప్పడమే కాకుండా, సుబ్రహ్మణ్య స్వామి పాత్రలోని దైవత్వాన్ని మరింత బలంగా ఆవిష్కరించే దిశగా స్క్రిప్టులో మార్పులు చేస్తున్నారని సమాచారం. హారిక అండ్ హాసిని క్రియేషన్స్, ఫార్చ్యూన్ ఫోర్ సినిమాస్ సంయుక్తంగా నిర్మిస్తున్న చిత్రం అత్యంత భారీస్థాయిలో రూపొందనుంది. నటీనటులు, సాంకేతిక బృందం వివరాలు త్వరలో వెల్లడి కానున్నాయి. ఇప్పటికే ఈ మైథలాజికల్ ప్రాజెక్టుపై భారీ బజ్ నెలకొంది. మరి పురాణ కథల పోరులో ఎవరిది పైచేయి అవుతుందో చూడాలి.

## హాట్ స్టార్!


అనుపమా పరమేశ్వరన్

# బాలయ్యకు బాలీవుడ్ అన్న



'దేవర' తర్వాత దర్శకుడు కొరటాల శివ.. నందమూరి బాలకృష్ణతో సినిమా చేస్తున్న సంగతి తెలిసిందే. ఈ చిత్రం నుంచి ఆసక్తికరమైన అప్‌డేట్ ఒకటి బయటకొచ్చింది. బాలీవుడ్ సీనియర్ నటుడు సంజయ్‌దత్ ఇందులో కీలక పాత్ర పోషించనున్నారని, అది ఏకంగా బాలయ్యకు అన్నయ్య పాత్ర అని ఇండస్ట్రీ వర్గాల్లో టాక్ నడుస్తోంది. అయితే సంజయ్‌దత్ పాత్ర కేవలం ఫ్లాష్‌బ్యాక్ ఎపిసోడ్‌లకే పరిమితం కానుందట. కొరటాల శివ సినిమా అనగానే ముందుగా గుర్తొచ్చేది బలమైన కథా నేపథ్యమే. తన ప్రతి చిత్రంలోనూ నేపథ్యం చుట్టూ ఆ ప్రాంతపు జీవనశైలిని అత్యంత సహజంగా ఆవిష్కరించడం ఆయన ప్రత్యేకత. మరి బాలయ్యతో చేస్తున్న ఈ చిత్రానికి ఎంచుకున్న నేపథ్యం ఏమిటన్నది ఆసక్తికరంగా మారింది. ఫ్యామిలీ ఎమోషన్స్ ప్రధానంగా సాగే ఈ కథ ఎంతో ప్రత్యేకంగా ఉంటుందని, 'దేవర' తర్వాత చేస్తున్న సినిమా కావడంతో కథపై కొరటాల విస్తృతంగా కసరత్తు చేశారని సమాచారం. సుధాకర్ చెరుకూరి నిర్మిస్తున్న చిత్రం అటు బాలయ్య అభిమానులకు, ఇటు కొరటాల మార్క్ సినిమా కోసం ఎదురుచూసే ప్రేక్షకులకు విందుభోజనం కానుందని ఇండస్ట్రీ భావిస్తోంది.

# యూకేలో 'అన్‌కట్' నాయగన్

ఏడు నెలల సుదీర్ఘ నిరీక్షణకు తెరదించుతూ విజయ్ చివరి చిత్రం 'జన నాయగన్' జులై 24న ప్రేక్షకుల ముందుకు రానుంది. హెచ్. వినోద్ దర్శకత్వంలో తెరకెక్కిన ఈ చిత్రానికి సెన్సార్ బోర్డు 12 మార్పులు సూచించి 'ఏ' సర్టిఫికెట్ జారీ చేసింది. విజయ్ రాజకీయ పార్టీ 'తమిళగ వెట్రి కళగం' ప్రస్తావన ఉన్న డైలాగ్‌ల తొలగింపు, కొన్ని పదాల మ్యూట్, కొన్ని సన్నివేశాల పూర్తి తొలగింపు వంటి మార్పులతో భారత్‌లో ఈ చిత్రం విడుదల కానుంది. అయితే యూకే ప్రేక్షకులకు మాత్రం అదృష్టం వరించింది. అక్కడి డిస్ట్రిబ్యూటర్ అహింసా ఎంటర్‌టైన్‌మెంట్ ప్రకటన ప్రకారం.. ఎలాంటి కట్స్ లేకుండా '15' రేటింగ్‌తో ఈ చిత్రం ఒరిజినల్ వెర్షన్‌లోనే అక్కడ విడుదల కానుంది. "అన్ని యాక్షన్ ఘట్టాలు, మాస్ మూమెంట్స్‌తో.. తీసిన రూపంలోనే, ఒక్క చివరిసారి" అంటూ డిస్ట్రిబ్యూటర్ చేసిన పోస్ట్ అభిమానుల్లో జోష్ నింపింది.



విజయ్ ఇప్పుడు తమిళనాడు ముఖ్యమంత్రి కావడంతో టైటిల్ కార్డులోనూ మార్పు జరిగింది. గతంలో 'దళపతి విజయ్' అని వచ్చే కార్డు.. ఇప్పుడు 'తమిళనాడు గౌరవ ముఖ్యమంత్రి సి. జోసెఫ్ విజయ్'గా మారనుంది. సుమారు 3 గంటల 3 నిమిషాల నిడివి ఉన్న ఈ చిత్రంలో పూజా హెగ్డే, మమిత బైజు, బాబీ డియోల్ కీలక పాత్రలు పోషించారు. అనిరుధ్ సంగీతం అందించిన ఈ చిత్రం.. నటుడిగా విజయ్‌కు వీడ్కోలు చిత్రం కావడంతో ప్రపంచవ్యాప్తంగా అభిమానులు వేడుకకు సిద్ధమవుతున్నారు. త్వరలోనే రిలీజ్ ట్రైలర్ రానున్నట్టు వార్తలు వస్తున్నాయి.

# మ్యాజిక్‌కే మంత్రమేసిన చిన్నారి

విభిన్న కథలతో ప్రేక్షకులను మెప్పించే మలయాళ స్టార్ ఫహాద్ ఫాజిల్.. తొలిసారి పూర్తిస్థాయి తెలుగు చిత్రంలో నటిస్తున్నారు. ఆ చిత్రమే 'డోంట్ ట్రబుల్ ది ట్రబుల్'. శశాంక్ యేలేటి దర్శకుడిగా పరిచయమవుతున్న ఈ చిత్రాన్ని 'బాహుబలి' నిర్మాత శోభు యార్లగడ్డతో పాటు రాజమౌళి తనయుడు ఎస్ఎస్ కార్తికేయ సంయుక్తంగా నిర్మిస్తుండటం విశేషం. సోమవారం చిత్రబృందం విడుదల చేసిన టీజర్ సోషల్ మీడియాలో దుమ్ము రేపుతోంది. టీజర్‌లో ఫహాద్ ఓ మెజీషియన్‌గా కనిపిస్తారు. ఓ చిన్నారి ముందు వరుస మ్యాజిక్ ట్రిక్స్ చేస్తూ అలరించే అతను.. ఆటలో భాగంగా ఆమెను మాయం చేసే ప్రయత్నం చేస్తాడు. అక్కడి నుంచి కథ ఊహించని మలుపు తిరుగుతుంది. సాధారణంగా కనిపించిన ఆ చిన్నారి ఒక్కసారిగా వింతగా ప్రవర్తించడం మొదలుపెడుతుంది. ఆత్మ ఆవహించినట్టు విచిత్ర శక్తులు ప్రదర్శిస్తూ మెజీషియన్‌కే షాక్ ఇస్తుంది. భయంతో పారిపోవాలని చూసే ఫహాద్‌ను ఆ చిన్నారే వెంటాడటం టీజర్‌కు హైలైట్‌గా నిలిచింది. హారర్, ఫాంటసీ, థ్రిల్లర్ జానర్‌ల మేళవింపుగా సాగిన ఈ టీజర్‌లో చివర్లో వచ్చే విజువల్స్, బ్యాక్‌గ్రౌండ్ స్కోర్ సినిమాపై క్యూరియాసిటీని రెట్టింపు చేశాయి. ఫహాద్‌తో పాటు సారా పాలేకర్, సౌరభ్ సచ్‌దేవ్ కీలక పాత్రల్లో నటిస్తున్న ఈ చిత్రం.. సెప్టెంబర్ 11న తెలుగు, తమిళ, మలయాళ భాషల్లో ఏకకాలంలో ప్రపంచవ్యాప్తంగా విడుదల కానుంది. ఫహాద్ మార్క్ 'వెరైటీ'పై ఇప్పటికే అంచనాలు మొదలయ్యాయి.

